ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 03 సంచిక -135 పేజీలు - 04 వెల - 04/- ఆదివారం 21 జూన్ 2026


# ప్రకృతి సేద్యంతోనే రైతులకు ప్రయోజనం

## చిలకలూరిపేట లో అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం


- ఏటా రూ.20 వేలు ఇస్తామన్న హామీ నిలబెట్టుకున్నాం
- రైతులు బాగుంటేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బాగుంటుంది
- 48 గంటల్లో ధాన్యం కొనుగోలు మొత్తాన్ని జమచేస్తున్నాం
- రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మళ్లాలి
- ఆంధ్రాను మించి తెలంగాణ ధాన్యం పండిస్తోంది
- వైకాపా హయాంలో రైతులు నానా కష్టాలు పడ్డారు
- లింగగుట్లో అన్నదాత సుఖీభవ నిధులు విడుదల
- రైతులకు అండగా ఉంటామని ప్రకటించిన చంద్రబాబు

**పల్నాడు,జూన్ 20 ఆంధ్ర ప్రగతి**

రైతులకు ఏటా రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చి.. దాన్ని నిలబెట్టుకున్నా మని సీఎం చంద్రబాబు అన్నారు. రైతు బాగుంటేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బాగుంటుందన్నారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం లింగంగుంట్లలో 'పీఎం కిసాన్- అన్నదాత సుఖీభవ' నిధులను విడుదల చేసిన అనంతరం ముఖ్యమంత్రి ప్రసంగించారు. నిధుల విడుదలకు సంబంధించి రైతులు తమ ఫోన్ ద్వారా వచ్చాయో లేదో చూసి చెప్పాలన్నారు. **మిగతా 2లో...**




# దేశానికి ఆధ్యాత్మిక హబ్‌గా ఆంధ్రప్రదేశ్



- యోగాకు గుర్తింపు తెచ్చిన ఆధ్యాత్మిక వేత్త బాబా రాందేవ్
- ఉండవల్ల గుహల వద్ద అంతర్జాతీయ యోగా నిర్వహణ
- బాబాతో కలసి ఆసనాలు వేసిన చంద్రబాబు
- చంద్రబాబు విజినరీ నేత అన్న బాబా రాందేవ్

**అమరావతి,జూన్ 20 ఆంధ్ర ప్రగతి**

: దేశానికి ఆధ్యాత్మిక హబ్‌గా ఆంధ్రప్రదేశ్ మారనుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని రాజధాని అమరావతిలోని ఉండవల్లి గుహల వద్ద యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. రాందేవ్ బాబా శిక్షణలో జరుగుతున్న యోగా సాధనను తిలకించారు. ఈ సందర్భంగా వివిధ రకాల యోగా ప్రక్రియలను రాందేవ్ బాబా సీఎంకు వివరించారు. బాబారామ్‌దేవ్‌తో కలిసి సీఎం యోగా సాధన చేశారు. **మిగతా 2లో...**



# ఒడిషాలో 47వేల కోట్లతో అభివృద్ధి పనులు

- రెండేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా మోడీ ప్రకటన
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో కలసి ప్రారంభించిన ప్రధాని
- ముర్ము స్వగ్రామం పహాడ్‌పూర్‌ను సందర్శించిన మోడీ
- అభివృద్ధి చేసి సోలార్ విలేజ్‌గా మారుస్తామని ప్రకటన

**భువనేశ్వర్,జూన్ 20 ఆంధ్ర ప్రగతి**

ఒడిషా రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఒడిశాలోని మయూర్‌భంజ్‌లో జరిగిన 'వికాస్ రా ధారా, ఒడిశా సారా' బహిరంగ సభలో **మిగతా 2లో...**

# రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కులాల దరిద్రం పోవాలి

## కాకినాడలో 'మన ఊరు - మాట మంతి' లో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

- నేరస్థుడికి కులం, మతం ఉండవు
- క్రిమినల్స్ చేతికి అధికారం వస్తే ?
- ప్రజల భవిష్యత్తు మంటగలుస్తుంది
- శాంతిభద్రతల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు
- నేరం చేసినవాళ్ళను కుల కోణంలో చూడొద్దు
- తప్పు చేస్తే మిమ్మల్ని ఏ పార్టీ రక్షించలేదు

**జూన్ 20 ఆంధ్ర ప్రగతి**

'సమాజంలో నేరస్థులను కేవలం క్రిమినల్స్ గా మాత్రమే చూడాలని, వారికి కులాల చాటున చూడకూడదు' అని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. **మిగతా 2లో...**



# నేడు నీట్ రీ-ఎగ్జామ్ నిర్వహణకు సర్వం సిద్ధం

- దేశవ్యాప్తంగా 22.79 లక్షల మంది దరఖాస్తు
- రాష్ట్రంలో 199 పరీక్షా కేంద్రాలు, 73,084 మంది విద్యార్థులు




**హైదరాబాద్‌జూన్ 20 ఆంధ్ర ప్రగతి**

వైద్య విద్య ప్రవేశాలకు నిర్వహించే నీట్ (యూజీ)-2026 రీ-ఎగ్జామ్ ఆదివారం జరగనుంది. ప్రశ్నాపత్రం లీకేజీ ఆరోపణల నేపథ్యంలో రద్దు చేసిన గత పరీక్షకు బదులుగా జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ) ఈ రీ-ఎగ్జామ్‌ను నిర్వహిస్తోంది. దేశవ్యాప్తంగా 22.79 లక్షల మంది అభ్యర్థులు ఈ పరీక్ష కోసం నమోదు చేసుకున్నారు. దేశంలోని 551 నగరాలు, విదేశాల్లోని 14 నగరాల్లో 5,432 కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తున్నారు. **మిగతా 2లో...**

# 'మెట్రో' పై కిషన్ రెడ్డికి రేవంత్ మరో లేఖాస్త్రం

- రైల్వే మంత్రితో భేటీకి ఏర్పాట్లు చేయాలని కిషన్ రెడ్డికి విజ్ఞప్తి
- అధికారులు, పత్రాలతో సమావేశానికి హాజరవుతానని వెల్లడి
- జూన్ 22, 23 తేదీల్లో ఢిల్లీ పర్యటనకు వెళ్లనున్న ముఖ్యమంత్రి

**హైదరాబాద్‌జూన్ 20 ఆంధ్ర ప్రగతి**

హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టుకు సంబంధించిన పెండింగ్ అంశాల పరిష్కారంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టి సారించారు. ఈ మేరకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేయాలని కోరుతూ కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి ఆయన లేఖ రాశారు. జూన్ 22, 23 తేదీల్లో తాను **మిగతా 2లో...**



# కొత్త ఓటరు నమోదుపై అబద్ధాలు నమ్మకండి

: తెలంగాణ 'సర్' ప్రక్రియపై ఎస్ఈవో సుదర్శన్‌రెడ్డి

- కొత్త ఓటు హక్కు నమోదు చేసుకునే అవకాశం లేదంటూ తప్పుడు ప్రచారం
- బూత్ లెవెల్ ఆఫీసర్లు ప్రతి ఇంటికి వస్తారన్న ఎస్ఈవో సుదర్శన్ రెడ్డి
- కొత్త ఓటర్లు వారి వివరాలను నమోదు చేసుకోవచ్చని క్లారిటీ

**హైదరాబాద్‌జూన్ 20 ఆంధ్ర ప్రగతి**

తెలంగాణ ఓటర్లకు, యువతకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఒక అధికారిక అప్‌డేట్ ఇచ్చింది. రాష్ట్రంలో కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకునే అవకాశం లేదంటూ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో వస్తున్న పుకార్లకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (ఎస్ఈవో) సుదర్శన్ రెడ్డి చెక్ పెట్టారు. ఓటరు జాబితా ప్రక్షాళన కోసం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌ప్రక్రియపై ఈరోజు హైదరాబాద్‌లో మీడియా సమావేశం **మిగతా 2లో...**



# హార్ముజ్ మళ్లీ క్లోజ్

- ఇరాన్ కీలక నిర్ణయం
- లెబనాన్‌పై ఇజ్రాయిల్ దాడుల ఎఫెక్ట్
- అమెరికా తన హామీలను నెరవేర్చే వరకు చర్చల్లో ఎలాంటి పురోగతి ఉండదని వెల్లడి



**టెహ్రాన్ : జూన్ 20 ఆంధ్ర ప్రగతి**

ప్రపంచ ఇంధన సరఫరాకు కీలక మార్గమైన హార్ముజ్ జలసంధి మళ్లీ మూత పడింది. లెబనాన్‌లో ఇజ్రాయిల్ దాడులు ఆపకపోవడంతో హార్ముజ్ జలసంధిని మూసివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. అమెరికా- ఇరాన్ మధ్య కుదిరిన తాత్కాలిక శాంతి ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ ఇజ్రాయిల్ **మిగతా 2లో...**

# ప్రకృతి సేద్యంతోనే రైతులకు ప్రయోజనం

**మొదటిపేజీ తరువాయి**

అక్కడే రైతులు సెలఫోన్లు ఊపుతూ వచ్చాయని సైగలు చేశారు. టెక్నాలజీ పెరగడంతో క్షణాల్లో వ్యవహారం తెలిసిపోతోందన్నారు. కూటమి ప్రభుత్వానికి అధికారం కట్టబెట్టినందుకు తాము నమ్మకంగా పనిచేస్తున్నామని అన్నారు. వైకాపా హయాంలో అన్నదాతలు అనేక సమస్యలు ఎదుర్కొన్నారని తెలిపారు. ప్రజలను కష్టాల్లోకి నెట్టడం తప్ప గొడ్డలి పార్టీకి మరేమీ తెలియదని విమర్శించారు. ఇవాళ యోగా, స్వచ్ఛాంధ్ర, అన్నదాత సుఖీభవ.. ఇలా మూడు మంచి కార్యక్రమాల్లో పాల్గొన్నాను. నా జీవితంలో ఇవాల్టికి మించిన ఆనందం మరొకటి లేదన్నారు. గత ప్రభుత్వం ఆర్థిక విధ్వంసం సృష్టించింది. విధ్వంసం నుంచి వికాసంవైపు తీసుకెళ్తామని మేం హామీ ఇచ్చాం. సంపద సృష్టించి.. రైతుల కష్టాలు తీరుస్తామని చెప్పాం. అన్నదాతలకు ప్రతి విషయంలో అండగా ఉన్నాం. బటన్ నొక్కగానే 99.8 శాతం మంది రైతులకు నిధులు



జమయ్యాయి. గతంలో ధాన్యం కొని ఆరు నెలలైనా డబ్బులు వచ్చేవి కావు. మా ప్రభుత్వం 48 గంటల్లోనే డబ్బులు ఇస్తోందన్నారు. ఒకప్పుడు ఆంధ్ర అంటే వరి.. తెలంగాణ అంటే మెట్ట పొలాలు. ఇప్పుడు ఆంధ్రాను డామినేట్ చేసి తెలంగాణ వరిని పండిస్తోంది. మనం ప్రకృతి సేద్యం వైపు మళ్లాలి. ఎక్కువ రసాయనాలు వినియోగిస్తే.. ఇతర దేశాలు మన ఉత్పత్తులను దిగుమతి చేసుకోవు. రైతులకు లాభసాటిగా ఉండాలని పామాయిల్ పంటను ప్రోత్సహిస్తున్నాం. రాయలసీమ హార్టికల్చర్ హబ్‌గా మారింది. సంజీవని ప్రాజెక్టు ద్వారా అందరి ఆరోగ్యాన్ని కాపాడుతాం అని చంద్రబాబు అన్నారు. 'పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ' కింద తొలి విడతగా 46.85 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.7 వేల చొప్పున రూ.3,125 కోట్లు జమయ్యాయి. పశ్చిమ బెంగాల్‌లో ప్రధాని మోదీ పాల్గొన్న పీఎం- కిసాన్ నిధుల విడుదల కార్యక్రమాన్ని రైతులతో కలిసి ముఖ్యమంత్రి వర్చువల్‌గా వీక్షించారు. లింగంగుంట్లలో ప్రజావేదిక సభ వద్ద ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. ప్రాసెసింగ్ ఎ÷-లాంట్లు, వర్మీకంపోస్ట్ తయారీ గురించి అడిగి తెలుసుకున్నారు. జాతీయ నూనెగింజలు, ఆయిల్‌పామ్ మిషన్ ప్రదర్శనలను తిలకించారు. ఈ కార్యక్రమంలో మంత్రి అచ్చన్నాయుడు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# దేశానికి ఆధ్యాత్మిక హబ్‌గా ఆంధ్రప్రదేశ్

రామ్‌దేవ్ శిక్షణలో జరుగుతున్న యోగా సాధనను తిలకించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. యోగాకు.. రాందేవ్ బాబా మంచి గుర్తింపు తీసుకొచ్చారన్నారు. యోగా సాధనతో ఆయన అద్భుతాలు సృష్టిస్తున్నారని కొనియాడారు. ఆయన శిక్షణలో యువత యోగాసనాలు అద్భుతంగా ఉన్నాయన్నారు. ప్రస్తుతం సమాజంలో యువత చాలా ఒత్తిడితో ఉందన్న సీఎం.. ఆధ్యాత్మికతతో కూడిన సాంకేతికత చాలా అవసరమన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 190 దేశాలు యోగాను అనుసరిస్తున్నాయని వివరించారు. బాబారామ్‌దేవ్ ఏదైనా చేయగలరన్నారు. యోగాకు.. రామ్‌దేవ్ మంచి గుర్తింపు తీసుకొచ్చారని కొనియాడారు. యోగా మన సంప్రదాయం, విజ్ఞానం, వారసత్వ సంపద అని చెప్పుకొచ్చారు. ప్రస్తుత సమాజంలో యువత చాలా ఒత్తిడితో ఉందని సీఎం అన్నారు. ఆధ్యాత్మికతతో కూడిన సాంకేతికత చాలా అవసరమని తెలిపారు. దేశానికి ఆధ్యాత్మిక హబ్‌గా ఏపీ మారనుందని పేర్కొన్నారు. ఉండవల్లి కొండల వద్ద యోగా.. చాలా అందమైన ఆలోచన అని



అన్నారు. అమరావతి కోసం 29 వేల మంది రైతులు 33 వేల ఎకరాలు ఇచ్చారని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ యునైటెడ్ నేషన్స్‌ను ఒప్పించి ప్రపంచ యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. 20 లక్షల ఎకరాల్లో రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం 31శాతం ఉన్న పచ్చదనాన్ని 50 శాతానికి పెంచడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామన్నారు. రాందేవ్‌బాబా మాట్లాడుతూ.. అభివృద్ధి, విజన్ కలిగిన సీఎం.. చంద్రబాబు అని కితాబిచ్చారు. ప్రధాని వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా సీఎం కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దేశంలోనే విజన్ ఉన్న నాయకుడని అన్నారు. గత 30 సంవత్సరాలుగా చంద్రబాబు ఏం అడుగుతారో.. తాము అది చేస్తున్నామని తెలిపారు. యోగా మన సంస్కృతి, సంప్రదాయాల్లో భాగమని రామ్‌దేవ్ బాబా తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు అందర్నీ సమానంగా చూస్తారని.. అందుకే ప్రజలు ఆయన్ను దేవుడిలా భావిస్తారన్నారు. అమరావతి దేవతల రాజధాని అని.. ఇక్కడ 40 శాతం పచ్చదనం, 60 శాతం నిర్మాణాలు ఉంటాయన్నారు. ఇది దేవ భూమి అని వెల్లడించారు. స్విట్జర్లాంట్ కోసం వెళ్లాల్సిన అవసరం లేదని... ఆంధ్రప్రదేశ్ వస్తే చాలని చెప్పారు. ఇక్కడి మామిడికాయలు, అరటిపండ్లు చాలా బాగుంటాయని.. ఎందుకంటే వాటిని సహజ సిద్ధంగా పండిస్తారని తెలిపారు. ఈసారి అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని 'యోగా ఫర్ హెల్త్ ఏజింగ్' పేరుతో నిర్వహిస్తున్నామని రామ్‌దేవ్ బాబా పేర్కొన్నారు.

# రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కులాల దరిద్రం పోవాలి

**మొదటిపేజీ తరువాయి**

రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోవాలంటే ఆంధ్రప్రదేశ్ కు కులాల దరిద్రం వదిలిపోవాలన్నారు. తప్పు చేసిన వాడికి, నేరాలకు పాల్పడేవారికి ఎలాంటి కులం, మతం ఉండవని, సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అటువంటి నీచమైన శక్తులను ఏ ఒక్కరూ సమర్థించకూడదని చెప్పారు. క్రిమినల్ గ్యాంగ్‌ల సహాయంతో ప్రభుత్వాలను నడపాలని చూడటం, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి అధికారులను తమ గుప్పెట్లో పెట్టుకోవాలని ప్రయత్నించడం ప్రజాస్వామ్య వ్యవస్థకు అత్యంత ప్రమాదకరమని హెచ్చరించారు. క్రిమినల్స్ అధికారంలోకి వస్తే ప్రజల భవిష్యత్తు మంటగలుస్తుందన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో కూటమి ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడబోదని, శాంతికి విఘాతం కలిగిస్తూ, తప్పులకు పాల్పడే వారి పట్ల అత్యంత కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. కులాలు, మతాల పరంగా వాట్సాప్ గ్రూపులు ఉన్నట్లే... లా అండ్ ఆర్డర్ కోసం, స్థానిక సమస్య కోసం వాట్సాప్ గ్రూపులు ఉండాలని, ఆ దిశగా ప్రజలు ఆలోచించాలని అన్నారు. శనివారం రాత్రి కాకినాడలో మన ఊరు మాట మంతి కార్యక్రమంలో ప్రసంగించారు.

ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ... "నేరపూరిత నేపథ్యం ఉన్న వ్యక్తులు రాజ్యాంగబద్ధమైన ఉన్నత పదవులను అధిష్టించి, ప్రజల జీవితాలను శాసించాలని చూడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికే గొడ్డలిపెట్టు. అటువంటి శక్తులపై నిరంతరం తిరగబడటానికి, న్యాయం కోసం పోరాడటానికి సిద్ధంగా ఉంటాను. వచ్చే ఎన్నికల్లో గెలుస్తానో లేదో తెలియదు కానీ ప్రజల కోసం నిరంతరం పోరాడతాను. c అంబేద్కర్ గారిపై గౌరవం ఉంటే తప్పుడు కేసులు పెట్టరు

**కులానికి పరిమితం చేయకండి**




నేను కులాలను దాటి దేశం వైపు వెళ్దామంటే నా దురదృష్టం నన్ను తిరిగి కుల చట్రంలోకి తీసుకువస్తారు. దేశాన్ని ప్రేమించే వాడు, అందరూ బాగుండాలని కోరుకునేవాడిని. వ్యవస్థలు బాగుండాలని కోరుకునే నన్ను కుల చట్రంలోకి పట్టుకువస్తారు. అయితే నన్ను బంధించలేరన్న విషయాన్ని వారు గుర్తు పెట్టుకోవాలి. జనసేన ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు ఎక్కడ శాంతి భద్రతలకు విఘాతం కలిగినా మీ గళం బలంగా వినిపించండి.

**అలా సమర్థించేవాళ్ళతో ప్రమాదం**

పాపం చిన్న వయసులో 23 నేరాలు చేశాడు, పాపం పసి వయసులో బీరు బాటిల్ తీసుకుని గొంతు కోసేశాడు, తెలిసి తెలియని పసి వయసు అని సమర్థించే వ్యక్తులను ప్రోత్సహిస్తే రాష్ట్ర భవిష్యత్తు అగమ్యగోచరం అవుతుంది. అలా సమర్థించేవారితో ప్రమాదం. ఇదే పెద్ద మనిషి నిర్భయ కేసులో తెలంగాణ పోలీసుల చర్యను సమర్థించాడు. ఇక్కడకు వచ్చేసరికి కులం అంటూ మాట్లాడుతున్నాడు. హోమ్ శాఖ మంత్రి గారిని సైతం అతని పార్టీ వాళ్ళు వ్యాఖ్యానిస్తున్నారు. ఆమె మేకప్ గురించి మాట్లాడుతున్నారు. ఇది అక్కడితో ఆగదు. ఇంటిలో మన ఆడబిడ్డలు ఫేస్ పౌడర్ కూడా రాసుకోకూడదా? రేపు ఏదో కాలేజీలో కుర్రాళ్ళు ఆడబిడ్డలను గురించి ఇదే విధంగా కామెంట్స్ చేస్తే... అప్పుడు పరిస్థితి ఏమిటి?నేను బాధ్యతలు తీసుకున్నాక కాకినాడలో ఎవరు ఎస్పీగా ఉండాలి ఎవరు కలెక్టర్ గా ఉండాలి అనే ఆలోచన చెయ్యలేదు. ఒక్కటే సూచన ఇచ్చాను ప్రజాస్వామ్యం బలంగా ఉండాలి, వ్యవస్థ బలంగా ఉండాలి. ఇది తప్పా నా దగ్గర నుండి మీకు ఎలాంటి ఫోన్లు రావు. నా పార్టీ వారు అయినా నేను ప్రోత్సహించను. ఎందుకంటే నేను వ్యవస్థలను బలపరచడానికి ఉన్నాను, బలహీనపరచడానికి కాదు" అన్నారు.

# ఒడిషాలో 47వేల కోట్లతో అభివృద్ధి పనులు

**మొదటిపేజీ తరువాయి**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒడిశా సర్వతోముఖాభివృద్ధి కోసం దాదాపు రూ.47,000 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జన్మదినం రోజే ఈ కార్యక్రమం జరగడం విశేషం. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జన్మదినం సందర్భంగా ఆమె స్వగ్రామమైన పహాడ్‌పూర్‌ను ప్రధాని మోదీ సందర్శించారు. ఈ గ్రామాన్ని వేగంగా అభివృద్ధి చేసి 'సోలార్ విలేజ్'గా మారుస్తామని ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామంలోని ప్రతి ఇంటికీ సౌరశక్తి అందుతుంది. ఒడిశాలోని ప్రసిద్ధ కోణార్క్ సూర్య దేవాలయానికి ఉన్న గుర్తింపు తరహాలోనే, పహాడ్‌పూర్ గ్రామం కూడా ప్రపంచపటంలో పునరుత్పాదక ఇంధన కేంద్రంగా సరికొత్త గుర్తింపును పొందుతుందని ప్రధాని పేర్కొన్నారు. ఒడిశాలోని సహజ వనరులను ఆర్థిక అవకాశాలుగా మార్చడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ప్రధాని తెలిపారు. రాష్ట్రంలో భారీగా పారిశ్రామిక వృద్ధి జరుగుతోందని, అంతర్జాతీయ, దేశీయ పెట్టుబడిదారులను ఆకర్షించడంలో 'ఉత్కర్ష్ ఒడిశా' ప్రచారం కీలక పాత్ర పోషిస్తోందని ఆయన కొనియాడారు. కొత్త పరిశ్రమల స్థాపన ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. గిరిజన యువతకు మెరుగైన విద్య, ఉపాధి అవకాశాలను అందించడం ద్వారా వారిని సాధికారత వైపు నడిపించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మోదీ పునరుద్ఘాటించారు. గిరిజన పిల్లలకు మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించేందుకు దేశవ్యాప్తంగా సుమారు 500 ఏకలవ్య మోడల్ స్కూళ్లను ప్రారంభించామని తెలిపారు. అంతకుముందు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ కలిసి పహాడ్‌పూర్ గ్రామంలోని 'సంతాలీ జాహిరా', 'హో జాహిరా' అనే పవిత్ర వనాలలో సంప్రదాయ పూజలు, ఆచారాలు నిర్వహించి దేశ శ్రేయస్సు కోసం ప్రార్థించారు. ప్రస్తుతం ఒడిశాలో పండుగ వాతావరణం నెలకొందని, గత వారమే 'గాన్ పర్దా' పండుగను ఘనంగా జరుపుకున్నారని, అలాగే జగన్నాథ రథయాత్ర, బరిపద రథయాత్ర ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయని ఈ సందర్భంగా ప్రధాని గుర్తుచేశారు. ఈ ఉత్సవాల మధ్య 'ప్రజాస్వామ్యం, అభివృద్ధి' అనే పండుగ కూడా ఇక్కడ నడుస్తోందని ఆయన హర్షం వ్యక్తం చేశారు.

# నేడు నీట్ రీ-ఎగ్జామ్

**మొదటిపేజీ తరువాయి**

తెలంగాణ నుంచి 73,084 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో మొత్తం 199 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాయి. పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.15 గంటల వరకు పెన్-అండ్-పేపర్ విధానంలో జరుగుతుంది. బయోమెట్రిక్ ధృవీకరణ, బహుళస్థాయి తనిఖీలు, కేంద్రాల పర్యవేక్షణ కోసం ప్రత్యేక చర్యలు అమలు చేస్తున్నట్లు ఎన్‌టీఏ తెలిపింది. అభ్యర్థులు అడ్మిట్ కార్డు, చెల్లుబాటు అయ్యే ఫొటో గుర్తింపు కార్డు తప్పనిసరిగా తీసుకురావాలి. పరీక్షా కేంద్రాలకు ముందుగానే చేరుకోవాలననీ, నిషేధిత వస్తువులను తీసుకురావద్దని పరీక్ష నిర్వహణా సంస్థ ఎన్‌టీఏ హెచ్చరించింది. డ్రెస్ కోడ్, ప్రవేశ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని పేర్కొంది. సోషల్ మీడియాలో ప్రశ్నాపత్రాలు, ఆన్సర్ కీలు, ప్రత్యేక సేవల పేరుతో వస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని అభ్యర్థులకు సూచించిం ది. అధికారిక సమాచారం కోసం ఎన్‌టీఏ వెబ్‌సైట్, ధృవీకరించిన వాట్సాప్ సేవలను ఉపయోగించుకోవాలని తెలిపింది. పరీక్ష నిర్వహణకు ముందు దేశవ్యాప్తంగా శనివారం మాక్‌డ్రిల్ నిర్వహించి కేంద్రాల సన్నద్ధతను పరిశీలించి నట్టు అధికారులు తెలిపారు. ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా పరీక్ష నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్‌టీఏ వెల్లడించింది.

# హార్ముజ్ మళ్లీ క్లోజ్

**మొదటిపేజీ తరువాయి**

ఈ దాడులకు పాల్పడటాన్ని తీవ్రంగా ఖండించింది. అమెరికా తన బాధ్యతల నుంచి తప్పుకోవడాన్ని నిరసిస్తూ ఇరాన్ ఉమ్మడి సైనిక కమాండ్ సంచలన నిర్ణయం తీసుకుంది. ఇజ్రాయిల్ దాడులు, అమెరికా నమ్మకద్రోహానికి ఇది మొదటి అడుగేనని, దాడులు ఆగకపోతే తదుపరి కఠిన చర్యలు ఉంటాయని ఇరాన్ హెచ్చరించింది. మరోవైపు స్విట్జర్లాండ్‌కు తమ దౌత్య బృందాన్ని పంపుతున్నట్టు ప్రకటిస్తూనే అమెరికా తన హామీలను నెరవేర్చే వరకు చర్చల్లో ఎలాంటి పురోగతి ఉండబోదని టెహ్రాన్ తేల్చి చెప్పింది. సైనిక హెచ్చరికల తర్వాత ఇరాన్ తన దౌత్య వ్యూహాన్ని కూడా మార్చింది. గత శుక్రవారమే జరగాల్సి ఉండి రద్దయిన స్విట్జర్లాం డ్‌లో శాంతి చర్చల కోసం తమ ప్రతినిధి బృందం బయలుదేరినట్టు ఇరాన్ ప్రకటించింది. అయితే ఈ పర్యటన కేవలం అమెరికాను నిలదీయడానికేనని స్పష్టం చేసింది. లెబనాన్‌లో యుద్ధం ఆపడం సహా కీలక హామీలను అమెరికా నెరవేరిస్తేనే తుది ఒప్పందంపై చర్చలు ముందుకు సాగుతాయని తెలిపింది. ఈ అవగాహన ఒప్పందంలో ఏ ఒక్క నిబంధన ఉల్లంఘించినా, మొత్తం శాంతి ప్రక్రియే ప్రమాదంలో పడుతుందని ఇరాన్ హెచ్చరించింది.

కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ లెబనాన్‌లో ఇజ్రాయిల్ తరచూ దాడులు జరపడంపై ఇరాన్ తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. ఈ కారణంతోనే ఇరాన్ హార్ముజ్ జలసంధి మూసివేత కఠిన నిర్ణయాన్ని తీసుకుంది. వాస్తవానికి అమెరికా- ఇరాన్ ఒప్పందంలో ఇటు ఇజ్రాయిల్ గానీ, అటు హిజ్బుల్లా గానీ భాగస్వాములు కావు. తాము హిజ్బుల్లాను పూర్తిగా నిర్మూలించే వరకు దక్షిణ లెబనాన్ నుంచి సైన్యాన్ని వెనక్కి తీసుకునే ప్రసక్తే లేదని ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు స్పష్టం చేశారు. ఈ దాడుల వల్ల స్విట్జర్లాండ్‌లో అమెరికా, ఇరాన్, ఖతార్ దౌత్యవేత్తల మధ్య జరగాల్సిన ఉన్నత స్థాయి చర్చలు మరింత ఆలస్యమయ్యేలా కనిపిస్తున్నాయి. కాగా తాజా పరిణామాల నేపథ్యంలో ఇంధన ధరలకు మళ్లీ రెక్కలు వచ్చే పరిస్థితులు కనిపిస్తున్నాయి. అయితే వచ్చే వారం వాషింగ్టన్‌లో ఇజ్రాయిల్, లెబనాన్ ప్రభుత్వాల మధ్య జరగబోయే అమెరికా మధ్యవర్తిత్వ చర్చలైనా ఈ సంక్షోభానికి తెరదించుతాయో లేదో చూడాలని విశ్లేషకులు చెప్తున్నారు.

## కొత్త ఓటరు నమోదుపై అబద్ధాలు నమ్మకండి

**మొదటిపేజీ తరువాయి**

నిర్వహించి పూర్తి వివరాలు వెల్లడించారు.సుదర్శన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... ఈనెల జూన్ 25 నుంచి బూత్ లెవెల్ ఆఫీసర్లు తమ పరిధిలోని ప్రతి ఇంటికీ స్వయంగా రానున్నారు. వారు ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తారు. ఈ వివరాల సేకరణ ప్రక్రియను పూర్తి చేసి జూలై 25 లోపు నివేదిక సమర్పించాల్సి ఉంటుంది. ఎవరైనా కొత్తగా ఓటు హక్కు పొందాలనుకుంటే అదే ఫారంలో తమ వివరాలను నమోదు చేసుకోవచ్చని క్లారిటీ ఇచ్చారు.ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా ఉండేందుకు ఇప్పటికే మ్యాపింగ్ వేగంగా సాగుతోంది. చాలా ప్రాంతాల్లో ఇప్పటికే 80 శాతం మ్యాపింగ్ పనులు పూర్తయ్యాయి. 2002 నాటి ఓటరు డేటాతో అనుసంధానమైన వారికి కొత్తగా ఎలాంటి ఇతర డాక్యుమెంట్లు అవసరం లేదు. వలస వచ్చిన వారు లేదా కొత్త ఓటర్ల కోసం ప్రభుత్వం జారీ చేసిన ప్రామాణిక పత్రాలను అనుమతిస్తామని సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు.

ఈ మొత్తం డ్రైవ్ పారదర్శకంగా సాగేందుకు డేటా ఎంట్రీ ఆపరేటర్లను కూడా నియమించినట్లు సుదర్శన్‌రెడ్డి తెలిపారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి గందరగోళం లేకుండా ఉండేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిరంతరం సమావేశాలు ఏర్పాటు చేయాలని జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. అన్ని ప్రక్రియలు ముగించుకుని అక్టోబర్ 1వ తేదీన తెలంగాణ తుది ఓటరు జాబితాను అధికారికంగా ప్రచురిస్తామని తెలిపారు.

## 'మెట్రో' పై కిషన్ రెడ్డికి రేవంత్ మరో లేఖాస్త్రం

**మొదటిపేజీ తరువాయి**

ఢిల్లీ పర్యటనలో ఉంటానని తెలిపారు. ఈ సందర్భంగా సంబంధిత పత్రాలతో వస్తానని, అధికారులతో కలిసి సమావేశానికి హాజరవుతానని ఆ లేఖలో పేర్కొన్నారు.ప్రధానంగా మెట్రో మొదటి దశకు సంబంధించిన ఐఆర్ఎఫ్‌సీ (ఐఆర్ఎఫ్‌సీ) నిధుల విడుదల, రెండో దశ విస్తరణకు అవసరమైన అనుమతులపై చర్చించాల్సి ఉందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్ నగరానికి మెట్రో రైలు అత్యంత కీలకమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టు అని ఆయన ఈ సందర్భంగా నొక్కిచెప్పారు. పెండింగ్ అంశాలపై త్వరితగతిన సానుకూల నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి తన లేఖలో వివరించారు.

# పీఎం కిసాన్ డబ్బులు విడుదల

### రూ. 2,000 చొప్పన 18,880 కోట్లు జమ

### హుగ్లీ జిల్లాలో విడుదల చేసిన ప్రధాని నరేంద్ర మోదీ



**కోల్‌కతా,జూన్ 20ఆంధ్ర ప్రగతి** పీఎం కిసాన్ డబ్బులు విడుదలయ్యాయి. ప్రధాని మోదీ 23వ విడత నిధులను విడుదల చేశారు. ఈ విడత ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న 9.44 కోట్ల మందికి పైగా అర్హులైన రైతు కుటుంబాల ఖాతాల్లోకి రూ. 2,000 చొప్పున మొత్తం రూ. 18,880 కోట్లు నేరుగా జమయ్యాయి. రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు కేంద్రం అమలు చేస్తున్న పీఎం- కిసాన్నిధులు విడుదలయ్యాయి. పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ జిల్లాలో జరిగిన కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ నిధులను విడుదల చేశారు. 23వ విడత కింద ఒక్కో రైతు ఖాతాలో రూ.2 వేలు చొప్పున జమ అయ్యాయి. దీంతో దేశవ్యాప్తంగా 9.44 కోట్ల మంది రైతులకు లబ్ది చేకూరింది. కేంద్రప్రభుత్వం 2019లో పీఎం-కిసాన్ పథకాన్ని ప్రారంభించింది. ఏటా మూడు దఫాలుగా రూ.2 వేలు చొప్పున మొత్తంగా రూ.6వేలను రైతుల ఖాతాల్లో వేస్తున్నారు. పీఎం కిసాన్ నిధులు పొందే వారి జాబితాలో మీ పేరుందో లేదో తెలుసుకోవచ్చు. ఇందుకోసం పీఎం కిసాన్ వెబ్‌సైట్‌లోకి వెళ్లిఅందులో 'ఫార్మర్ కార్నర్' సెక్షన్‌లోకి వెళ్లాలి. అందులో లబ్దిదారుల లిస్ట్‌పై క్లిక్ చేస్తే రాష్ట్రం, జిల్లా, బ్లాక్, గ్రామం ఎంచుకుంటే లబ్దిదారుల జాబితా కనిపిస్తుంది. అందులో మీ పేరు ఉందో లేదో తెలుసుకోవచ్చు. ఇ-కేవైసీ చేయని వారికి నిధులు జమ కావు. కాబట్టి అదే పోర్టల్‌లో ఇ-కేవైసీ ఆప్షన్ ఎంచుకుని ఆధార్ నంబర్, ఓటీపీ ద్వారా వెరిఫికేషన్ పూర్తి చేయొచ్చు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# అందరి సహకారంతోనే నగర పరిశుభ్రత

**జిల్లా కలెక్టర్, నగరపాలక ప్రత్యేక అధికారిణి డాక్టర్ ఏ. సిరి - కలెక్టరేట్ ప్రాంగణంలో స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం**

**పారిశుద్ధ్యంపై ప్రజల్లో అవగాహన పెరగాలి - వీధుల్లో వ్యర్థాలు వేస్తే జరిమానా తప్పదు**





**ఆంధ్ర ప్రగతి కర్నూలు టౌన్ జూన్ 20:** ప్రజలందరి సహకారంతోనే నగర పరిశుభ్రత సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్, నగరపాలక ప్రత్యేక అధికారిణి డాక్టర్ ఏ. సిరి పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ ప్రాంగణంలో కలెక్టర్, కమిషనర్ చల్లా ఓబులేసుతో కలిసి స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ప్రజలు, ఉద్యోగులచే స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గత నాలుగు వారాలుగా వివిధ అంశాలతో ఆపరేషన్ క్లీన్ స్వీప్ ప్రత్యేక కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశామని, ఇది ప్రత్యేక డ్రైవ్‌గా కాకుండా నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందన్నారు. పారిశుద్ధ్యంపై ప్రజల్లో అవగాహన పెరగాలని, చెత్తను ఎక్కడబడితే అక్కడ వేయకుండా తడి, పొడి, హానికరమైన, ప్రత్యేకమైన వ్యర్థాలను వేర్వేరుగా చేసి మున్సిపల్ వాహనాలకే అప్పగించడం విధిగా భావించాలని సూచించారు. పర్యావరణానికి హాని కలిగించే వ్యక్తులకు జరిమానాలు విధించే అధికారాలను దేశ అత్యున్నత న్యాయస్థానం కలెక్టర్లకు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఎవరైనా బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే జరిమానా విధిస్తామని స్పష్టం చేశారు.

కమిషనర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆపరేషన్ క్లీన్ స్వీప్ పేరుతో గత నాలుగు వారాలుగా ప్రతి శనివారం ప్రత్యేక థీమ్‌తో స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. రహదారులు, జంక్షన్లు, రెడ్-యెల్లో స్పాట్ల శుభ్రత, కాలువలు, డ్రైన్లు, వీధుల పరిశుభ్రత, వ్యర్థాల వర్గీకరణపై అవగాహన, మార్కెట్లు, వాణిజ్య ప్రాంతాల పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టామన్నారు. చివరి వారంలో ప్రజా మరుగుదొడ్ల పరిశుభ్రత, చెత్త పేరుకుపోయిన ప్రాంతాల శుభ్రత పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. నగర శుభ్రత కోసం ప్రభుత్వం, నగరపాలక సంస్థ, పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న కృషిని ప్రజలు గుర్తించి సహకరించాలని కమిషనర్ కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం. రఘు, సానిటరీ సూపర్వైజర్ రమేష్ బాబు, డీఈఈలు పవన్ కుమార్ రెడ్డి, కృష్ణలత, ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు, ఎంటమాలజిస్ట్ సత్యనారాయణ, స్వచ్ఛ సర్వేక్షణ్ కోఆర్డినేటర్లు శ్రీనివాసులు, జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడి కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ డా. ఎ.సిరి, ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి.



**ఆంధ్ర ప్రగతి కర్నూల్ టౌన్ జూన్ 20:** కర్నూల్ నగరంలోని 19 వార్డు గణేష్ నగర్ లో ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్మెంట్ సర్వీసెస్ (ఐసిడిఎస్) ప్రాజెక్టు కింద నిర్వహించబడుతున్న అంగన్వాడి సెంటర్ (1311094) ను జిల్లా కలెక్టర్ డా. ఎ.సిరి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి నేడు ఆకస్మిక తనిఖీ చేశారు. అంగన్వాడీ కేంద్రంలో ఆహార నాణ్యత, పరిశుభ్రత, టాక్ రిజిస్టర్ ఎంట్రీలను పరిశీలించారు. అందిస్తున్న ఆహారం, పరిశుభ్రత మరింత మెరుగుపడేలా తగు చర్యలు తీసుకోవాలని సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. పిల్లలతో ముచ్చటించి, ప్రశ్నలతో వారి ప్రోగ్రెస్ ను తెలుసుకున్నారు. పిల్లలకు తినుబండారాలు పంచారు. అంగన్వాడి కేంద్రం సిబ్బంది, పిల్లల తల్లిదండ్రులతో వాట్సాప్ గ్రూప్ ద్వారా సూచనలు, సలహాలు, తరచుగా ఫీడ్బ్యాక్ తీసుకోవాలని ఆదేశించారు. నైతిక విలువలు, మంచి ప్రవర్తన అలవడేలా పిల్లలకు బోధించాలని సూచించారు. అంగన్వాడి కేంద్రంలో మెరుగైన సౌకర్యాలు, శుభ్రమైన శౌచాలయం, స్వచ్ఛమైన తాగునీరు, మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా పౌష్టికాహారం ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మాతా శిశు సంక్షేమ శాఖ అధికారులు ప్రతి అంగన్వాడీ కేంద్రాన్ని తరచుగా సందర్శించి, తనిఖీలు నిర్వహించాలన్నారు. నిరంతర పర్యవేక్షణ ద్వారా అంగన్వాడీ కేంద్రాలు క్రియాశీలకంగా పనిచేసే బాధ్యత తీసుకోవాలని కలెక్టర్ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు.

ఈ సందర్భంగా పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారం సద్వినియోగం చేసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. విజయ తదితరులు పాల్గొన్నారు.

# నీట్ పరీక్ష నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి.

**..జిల్లాలో 16 పరీక్షా కేంద్రాల్లో హాజరు కానున్న 4,995 మంది విద్యార్థులు.**

**..విద్యార్థులు మధ్యాహ్నం 1:30 గంటలలోపు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి.**

**..త్రాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ క్యాంపులు, అంబులెన్స్‌లు, బ్యాకప్ జనరేటర్లు సిద్ధం.**

**..విద్యార్థులు ప్రశాంతంగా పరీక్ష రాయాలి - ఆల్ ది బెస్ట్." జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి.**




**ఆంధ్ర ప్రగతి కర్నూలు, జూన్ 20:** జూన్ 21న నిర్వహించనున్న జాతీయ అర్హత మరియు ప్రవేశ పరీక్ష (నీట్-యూజీ)ను జిల్లాలో ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి తెలిపారు.

శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో నీట్ పరీక్ష నిర్వహణ, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ, ముఖ్యమంత్రి పర్యటన అంశాలపై నిర్వహించిన మీడియా సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ....జిల్లాలో మొత్తం 16 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా, 4,995 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్షను ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా సజావుగా నిర్వహించేందుకు అన్ని శాఖల సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేపట్టినట్లు వెల్లడించారు. పరీక్ష నిర్వహణ కోసం ఇద్దరు సిటీ కోఆర్డినేటర్లను నియమించగా, వారు 16 మంది చీఫ్ సూపరింటెండెంట్లతో సమన్వయం చేస్తూ మొత్తం ప్రక్రియను పర్యవేక్షిస్తుంటారని తెలిపారు. చీఫ్ సూపరింటెండెంట్లు, నోడల్ అధికారులకు ప్రత్యేక ఓరియంటేషన్, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ప్రశ్నాపత్రాల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రశ్నాపత్రాల స్టోరేజ్ పాయింట్ వద్ద నిరంతర భద్రతా సిబ్బందిని నియమించామని, స్టోరేజ్ పాయింట్ నుంచి పరీక్షా కేంద్రాలకు ప్రశ్నాపత్రాల తరలింపు సమయంలో చీఫ్ సూపరింటెండెంట్లు, అబ్జర్వర్లు, ఇద్దరు సాయుధ సీఆర్పీఎఫ్ సిబ్బంది పర్యవేక్షణలో తరలించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పరీక్షా కేంద్రాల పర్యవేక్షణ కోసం ప్రతి కేంద్రానికి ఒక తహసీల్దార్ స్థాయి ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్‌ను నియమించామని, ప్రతి నాలుగు కేంద్రాలకు ఒక జిల్లా స్థాయి అధికారిని నోడల్ అధికారిగా నియమించి ప్రత్యేక బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసి, వాటి మానిటరింగ్ వ్యవస్థలను అనుసంధానం చేసినట్లు తెలిపారు. పోలీసు శాఖ తరఫున ఫ్రిస్కింగ్ సిబ్బందిని నియమించడంతో పాటు అవసరమైన ఫ్రిస్కింగ్ పరికరాలను కూడా సిద్ధంగా ఉంచినట్లు వెల్లడించారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహించే కార్యక్రమాలు ఉదయం వేళల్లోనే ముగియనున్నందున, నీట్ పరీక్ష నిర్వహణకు ఎలాంటి అంతరాయం కలగకుండా రహదారులు, ట్రాఫిక్ మార్గాలను ముందుగానే క్లియర్ చేసే చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించబడుతుందని, ప్రత్యేక అవసరాల దృష్ట్యా అదనంగా 15 నిమిషాల సమయం కల్పించే అంశంపై సంబంధిత అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. పరీక్ష అనంతరం సమాధాన పత్రాల సేకరణ, భద్రపరచడం, పోస్టల్ శాఖతో సమన్వయం చేసి వాటిని సకాలంలో గమ్యస్థానాలకు పంపించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. వాతావరణ శాఖ నుంచి వర్ష సూచనలు ఉన్న నేపథ్యంలో అభ్యర్థులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ముందస్తు చర్యలు చేపట్టామని తెలిపారు. అవసరానికి అనుగుణంగా అదనపు బస్సులను ఏర్పాటు చేయడంతో పాటు, పరీక్షా కేంద్రాలకు సులభ రవాణా సౌకర్యాలు కల్పించినట్లు వెల్లడించారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో త్రాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ క్యాంపులు, అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేందుకు వైద్యుల ఫోన్ నంబర్లను ప్రతి పరీక్షా కేంద్రంలో ప్రదర్శించేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా ముందస్తుగా ప్రత్యేక ఏర్పాట్లు చేశామని, ప్రతి పరీక్షా కేంద్రంలో బ్యాకప్ జనరేటర్లను సిద్ధంగా ఉంచినట్లు కలెక్టర్ తెలిపారు. మీడియా ద్వారా విద్యార్థులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఈరోజు రాత్రి త్వరగా నిద్రపోయి తగిన విశ్రాంతి తీసుకోవాలని, పరీక్షా కేంద్రాలకు మధ్యాహ్నం 1:30 గంటలలోపు తప్పనిసరిగా చేరుకోవాలని సూచించారు. మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, బ్లూటూత్ పరికరాలు సహా ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించబోమని స్పష్టం చేశారు. అభ్యర్థులతో పాటు వచ్చే తల్లిదండ్రుల కోసం ప్రత్యేక వెయిటింగ్ ఏరియాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, విద్యార్థులు ఎలాంటి ఆందోళన లేకుండా ప్రశాంతంగా పరీక్షకు హాజరై తమ ప్రతిభను చాటాలని ఆకాంక్షిస్తూ జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు."విద్యార్థులు విజయవంతంగా పరీక్ష రాయాలని ఆకాంక్షిస్తున్నాం. ఆల్ ది బెస్ట్." అని కలెక్టర్ పేర్కొన్నారు.

అంతకుముందు నీట్-యూజీ పరీక్ష నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి సాయిప్రసాద్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్లో జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లతో ఈ పరీక్షను సక్రమంగా, సజావుగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కలెక్టర్లను ఆదేశించారు.

# యోగ వ్యాయామాలు చెయ్యండి.. ఆరోగ్యాన్ని పెంపొందించుకోండి.

**-సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి.**


పి. మహమ్మద్ రఫి,సామాజిక కార్యకర్త, డోన్.

**ఆంధ్ర ప్రగతి డోన్ జూన్ 20:** ప్రస్తుత అధునిక యుగం లో అందరు ఆరోగ్యంగా ఉండాలంటే యోగ వ్యాయామాలు చెయ్యాలని సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి తెలిపారు. ప్రస్తుత సమాజం లో సామాన్య ప్రజలను జాగ్రుత పరచవలసిన అవసరం ప్రతి ఒక్కరికి ఎంతైన ఉన్నది. యోగభ్యాసం వల్ల మంచి ఆరోగ్యం తో పాటు శారీరక దృఢత్వం, మానశిక శాంతి, అత్మశాంతి లభిస్తుంది. కావున ప్రతి ఒక్కరు తమ దినచర్య లో ఖచ్చితంగా యోగ ,వ్యాయామాలు,ధ్యానం చెయ్యాలని సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి తెలిపారు. యోగా చెయ్యడం వల్ల తమ ఆరోగ్యాన్ని ఖర్చు లేకుండా కాపాడుకోవచ్చును. నేడు మన నిత్యజీవితం లో మనం పీల్చే గాలి, తినేతిండి, ప్రయాణించే ప్రదేశాలు ,ఉండే పరిసరాలు అన్ని కాలుష్యంతో, కలుషితంతో కూడుకున్నవే. దీని వల్ల వ్యాధుల ప్రాబల్యం ఎక్కువైనది. వీటిని ఎదుర్కోవాలంటే ఖచ్చితంగా యోగా భ్యాసాల వల్లనే సాధ్యమైతుంది. యోగ చెయ్యడం వల్ల శరీరంలో మార్పులు కన్పిస్తాయి. శరీరం తేలిక కావడం మానసికంగా బాధపడేవారికి పూర్తిస్థాయి లో మనోధైర్యంతో మనస్సు ఉత్సాహంగా ఉండటం జరుగుతుందని సామాజిక కార్యకర్త పి. మహమ్మద్ రఫి తెలిపారు. అందువల్ల శరీరానికి శక్తి నిచ్చె యోగాజీవితాన్ని దివ్యజీవణాన్ని అలవర్చుకోవాలని సూచించారు. యోగ అనేది మనలో అంతర్లీనంగా ఉండే శక్తిని సమతుల్యమైన పద్ధతిలోమెరుగుపరచుకోవడానికి లేక అభివృద్ధి చేసుకోవడానికి ఉపకరించే ఒక క్రమశిక్షణ వంటిది. కీలకమైన స్వయం అనుభూతిని సాధించుకోవడానికి ఇది ఒక మార్గాన్ని చూపిస్తుంది. యోగా అంటే అంతరాత్మను విశ్వాత్మ తో ఐక్యం చేసే మార్గమని చెప్పవచ్చు. యోగ విశ్వవ్యాప్తంగా ఆచరించే ఒక క్రమశిక్షణ ,సంస్కృతి, జాతీయత, వర్గం, కులం, మతం, విశ్వాసం, లింగబేధం, వయసు మరియు శారీరక స్థితితో నిమిత్తంలేని, సాధన చేయడానికి మరియు అన్వయించుకోవడానికి కూడా యోగ ఒక విశ్వవ్యాప్తంగా యోగ్యత కల సత్ప్రవర్తనతో కూడి వుండే సాధన. రోజువారీ, ఒక క్రమపద్ధతిలో సాధన చేయడం వల్లనే శరీరాన్ని, మనసునూ ఉన్నత స్థితికి చేర్చడానికి ఇది ఒక విధమైన ఒరవడిని సృష్టిస్తుందని సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి తెలిపారు. మనసును శిక్షణ ద్వారా లగ్నం చేస్తూ, అంతరాత్మను పరిశుద్ధం చేయడం ద్వారా ఉన్నత స్థితిలో ఉన్న అంతరాత్మ యొక్క అనుభూతిని పొందడానికి సాధకుడిలో తీవ్రమైన మనోవాంఛ, కోరిక ఉండవలసి ఉంటుంది. యోగా అనేది పురాతన భారతీయ సాంప్రదాయం మరియు మానవాళి అపూర్వమైన నిధి. యోగ అనేది మనస్సు మరియు శరీర ఏకత్వాన్ని ఉద్ఘాటిస్తుంది. ఆరోగ్యం మరియు శ్రేయస్సుకు పవిత్రమైన మార్గం. ఇది వ్యాయామం కాదు. ఇది మిమ్మల్ని మీరు, మనల్ని మనం తెలుసుకోవడానికి సహాయపడే జీవన మార్గమని సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి తెలిపారు.

# కూటమి ప్రభుత్వంలో..రైతు సంక్షేమానికి పెద్దపీట..!

**అన్నదాతకు అండగా ప్రభుత్వం.. ప్రతి అర్హ రైతుకు ఏడాదికి రూ.20 వేల ఆర్థిక భరోసా.**

**వ్యవసాయాభివృద్ధే లక్ష్యం. రైతుల ఖాతాల్లో భారీగా నిధుల జమ.**

**.అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్‌తో రైతు కుటుంబాలకు ఆర్థిక భద్రత.**

**.రైతు సంక్షేమం, భూసార పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు - జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి.**







**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్ 20:** రైతుల ఆర్థిక స్థిరత్వం, వ్యవసాయ రంగాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న "అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్" పథకం ద్వారా నంద్యాల జిల్లాలో అర్హులైన రైతులకు భారీ స్థాయిలో ఆర్థిక సహాయం అందిస్తున్నామని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. శనివారం నంద్యాల మండలం పోలూరు గ్రామంలో నిర్వహించిన "అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్" పథకం కార్యక్రమంలో కలెక్టర్ తో పాటు నంద్యాల పార్లమెంటు సభ్యురాలు బైరెడ్డి శబరి వ్యవసాయ, అనుబంధ రంగాల అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో మొత్తం 2,06,052 మంది రైతులకు రూ. 139.41 కోట్ల ఆర్థిక సహాయం రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ. 103.03 కోట్లు, కేంద్ర ప్రభుత్వం తరఫున రూ. 36.39 కోట్లు అందించబడినట్లు పేర్కొన్నారు. రైతుల ఆదాయాన్ని పెంచడం, సాగు ఖర్చులను తగ్గించడం, వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చడం లక్ష్యంగా ప్రభుత్వం ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకం కింద అర్హులైన ప్రతి రైతుకు సంవత్సరానికి రూ. 20 వేల ఆర్థిక సహాయం మూడు విడతలుగా అందజేస్తున్నట్లు వివరించారు. తొలి, రెండో విడతల్లో కేంద్ర ప్రభుత్వం నుంచి రూ. 2 వేలు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ. 5 వేలు చొప్పున మొత్తం రూ. 7 వేల చొప్పున, మూడో విడతలో కేంద్రం నుంచి రూ. 2 వేలు, రాష్ట్రం నుంచి రూ. 4 వేలు కలిపి రూ. 6 వేలు అందజేస్తున్నట్లు తెలిపారు.

జిల్లాలో అత్యధికంగా ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని 42,981 మంది రైతులకు రూ. 29.10 కోట్లు, బనగానపల్లె నియోజకవర్గంలోని 40,664 మంది రైతులకు రూ. 27.41 కోట్లు, నంద్యాల నియోజకవర్గంలోని 36,734 మంది రైతులకు రూ. 24.94 కోట్లు అందించగా, డోన్ నియోజకవర్గంలోని 35,011 మంది రైతులకు రూ. 23.40 కోట్లు, శ్రీశైలం నియోజకవర్గంలోని 25,018 మంది రైతులకు రూ. 17.06 కోట్లు, నందికొట్కూరు నియోజకవర్గంలోని 12,953 మంది రైతులకు రూ. 8.79 కోట్లు, పాణ్యం నియోజకవర్గంలోని 12,691 మంది రైతులకు రూ. 8.72 కోట్లు మంజూరైనట్లు వెల్లడించారు. వ్యవసాయ ఉత్పాదకత పెరగాలంటే భూసారాన్ని కాపాడుకోవడం అత్యంత అవసరమని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వం యూరియా, డి.ఎ.పి., కాంప్లెక్స్ ఎరువులను భారీ సబ్సిడీపై అందిస్తున్నప్పటికీ, వాటిని మితిమీరిన స్థాయిలో వినియోగించడం వల్ల భూమి సారవంతత తగ్గే ప్రమాదం ఉందన్నారు. భూముల్లో జింక్, సూక్ష్మపోషకాలు, కర్బన శాతం లోపిస్తున్నాయని శాస్త్రవేత్తలు గుర్తించారని, రైతులు పచ్చిరొట్ట పంటలు సాగు చేయడం, సేంద్రీయ ఎరువుల వినియోగాన్ని పెంచడం ద్వారా భూసారాన్ని పరిరక్షించాలని సూచించారు. పోలూరు గ్రామంలో ప్రజలు ప్రస్తావించిన సమస్యలపై స్పందించిన కలెక్టర్, పాఠశాల చుట్టూ వర్షపు నీరు నిలిచిపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా ఇప్పటికే రూ. 5 లక్షలతో అభివృద్ధి పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. పాఠశాల మైదానం లెవెలింగ్ అంశాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామంలోని సీసీ రోడ్లపై నీరు నిలిచే సమస్యను సాంకేతిక నిపుణులతో పరిశీలించి పరిష్కరిస్తామని చెప్పారు. అలాగే పొలాల రహదారుల నిర్మాణానికి సంబంధించి ఉపాధి హామీ పథకం సాఫ్ట్‌వేర్‌లో జూలై 1 నుంచి అమల్లోకి రానున్న మార్పుల అనంతరం అవసరమైన చర్యలు చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు. గ్రామాభివృద్ధి అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రజల భాగస్వామ్యం, సహకారం ఉంటేనే గ్రామాలు వేగంగా అభివృద్ధి చెందుతాయని కలెక్టర్ పేర్కొన్నారు. రైతులు, ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని గ్రామాభివృద్ధికి తోడ్పడాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి మాట్లాడుతూ, రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రైతు బాగుంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. రైతుల కష్టాలను అర్థం చేసుకున్న కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకాల ద్వారా ఆర్థిక సహాయాన్ని నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తోందని తెలిపారు. పోలూరు గ్రామ అభివృద్ధికి అవసరమైన రోడ్లు, నీటి పారుదల, పాఠశాల మౌలిక వసతుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామ సమస్యలను ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకువస్తే నిధుల మంజూరుకు తన వంతు సహకారం అందిస్తానని పేర్కొన్నారు.

# రెవెన్యూ శాఖపై ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయాలి

**-.పారదర్శక సేవలతో ప్రజలకు చేరువ కావాలి.**

**కొత్త తరం రెవెన్యూ ఉద్యోగులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలి.**

**.ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలి.**

**..అవినీతికి తావు లేకుండా సేవలందించాలి.**

**..జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి.**






**ఆంధ్ర ప్రగతి కర్నూలు, జూన్ 20:**
రెవెన్యూ శాఖపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసేందుకు అధికారులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి సూచించారు. ప్రజలకు పారదర్శకమైన, వేగవంతమైన, బాధ్యతాయుతమైన సేవలను అందించడం ద్వారా శాఖ ప్రతిష్ఠను మరింత పెంచవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు.
శనివారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించిన రెవెన్యూ దినోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరితో పాటు జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ పాల్గొన్నారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజలు ఏ సమస్య వచ్చినా ముందుగా ఆశ్రయించే శాఖ రెవెన్యూ శాఖేనని తెలిపారు. పుట్టినప్పటి నుంచి మరణానంతర సేవల వరకు ప్రజల జీవితంలో ప్రతి దశలో రెవెన్యూ శాఖ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. జనన, మరణ ధృవీకరణ పత్రాల జారీ, భూ సమస్యల పరిష్కారం, ఎన్నికల నిర్వహణ, ప్రకృతి వైపరీత్యాల సమయంలో సహాయక చర్యలు, పునరావాస కార్యక్రమాలు, శాంతిభద్రతల పరిరక్షణ, మెజిస్ట్రేటు విధులు, కోవిడ్ వంటి అత్యవసర పరిస్థితుల్లో సేవలు అందించడంలో రెవెన్యూ శాఖ విశిష్టమైన బాధ్యతలను నిర్వర్తిస్తోందని కలెక్టర్ వివరించారు. ప్రస్తుతం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) ద్వారా అందుతున్న ఫిర్యాదుల్లో అధిక శాతం రెవెన్యూ శాఖకు సంబంధించినవేనని పేర్కొన్న కలెక్టర్, సమస్యలు ప్రారంభ దశలోనే పరిష్కరించేలా అధికారులు చొరవ చూపాలని సూచించారు. ఫిర్యాదులు తగ్గేలా ముందస్తు చర్యలు తీసుకుని ప్రజలకు వేగవంతమైన సేవలు అందించాలని ఆదేశించారు. రెవెన్యూ శాఖపై అప్పుడప్పుడు వ్యక్తమవుతున్న ప్రతికూల అభిప్రాయాలకు కారణాలను గుర్తించి, వాటి నివారణకు కృషి చేయాలని సూచించారు. కొద్దిమంది ఉద్యోగుల నిర్లక్ష్యం లేదా అనుచిత ప్రవర్తన వల్ల మొత్తం శాఖ ప్రతిష్ఠ దెబ్బతినే పరిస్థితి ఏర్పడుతుందని, అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ప్రతి ఉద్యోగి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. నేటి తరానికి చెందిన కొత్త రెవెన్యూ ఉద్యోగులకు శాఖ విధులు, బాధ్యతలు, చట్టాలు, పరిపాలనా విధానాలపై పూర్తి అవగాహన కల్పించేందుకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి ఉద్యోగి తమ విధులు, బాధ్యతలపై సమగ్ర అవగాహన కలిగి ఉండటం అత్యంత అవసరమని పేర్కొన్నారు. జిల్లాలో రెవెన్యూ శాఖతో పాటు ఇతర శాఖలకు సంబంధించిన కారుణ్య నియామకాల ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అలాగే రెవెన్యూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు ప్రత్యేక సమీక్షలు నిర్వహించి, అందిన అర్జీలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఇప్పటికే సంబంధిత అధికారులకు ఆదేశించినట్లు తెలిపారు. ఉద్యోగులు విధుల ఒత్తిడికి గురికాకుండా పనులను ప్రాధాన్యత క్రమంలో విభజించుకుని దశలవారీగా పూర్తి చేయాలని సూచించారు. మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడానికి యోగా, వ్యాయామం, ఫిట్‌నెస్ వంటి ఆరోగ్యకరమైన అలవాట్లను జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందని, తాత్కాలిక సమస్యల కారణంగా తొందరపడి తప్పుడు నిర్ణయాలు తీసుకోకూడదని ఉద్యోగులకు సూచించారు. చిన్నచిన్న కారణాలకు ఆత్మహత్యల వంటి తీవ్ర నిర్ణయాలు తీసుకోవడం చట్టరీత్యా నేరమేకాక కుటుంబాలకు, సమాజానికి తీవ్ర నష్టం కలిగిస్తుందని పేర్కొన్నారు. సమస్యలను ధైర్యంగా ఎదుర్కొంటూ సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలని, నేటి తరానికి ఆదర్శంగా నిలవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఉద్యోగులు ఎల్లప్పుడూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉంటూ ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. కలెక్టరేట్‌తో పాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు గౌరవప్రదమైన వాతావరణం కల్పించాలని, అవినీతికి ఏమాత్రం తావు లేకుండా నాణ్యమైన సేవలు అందించాలని స్పష్టం చేశారు. ప్రజలతో సానుభూతితో, గౌరవంతో వ్యవహరించినప్పుడే శాఖకు మంచి పేరు వస్తుందని తెలిపారు.

**రెవెన్యూ శాఖపై ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయాలి: జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్‌లి**

ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ..రెవెన్యూ శాఖ ప్రభుత్వ పరిపాలనా వ్యవస్థలో అత్యంత కీలకమైన విభాగమని, ప్రజల సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుండి పనిచేస్తూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుందని జేసీ తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు చేరువ కావడంలో, ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించడంలో రెవెన్యూ శాఖ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ప్రభుత్వం అమలు చేసే ప్రతి కార్యక్రమంలోనూ రెవెన్యూ శాఖ ప్రత్యక్షంగా భాగస్వామ్యమై ఉంటుందని, గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నిర్వహించే అన్ని కార్యక్రమాల విజయవంతమైన అమలులో రెవెన్యూ సిబ్బంది కృషి ఎంతో కీలకమని ఆయన వివరించారు. కార్యక్రమాల అమలులో ఎలాంటి సవాళ్లు ఎదురైనా వాటిని సమర్థవంతంగా అధిగమిస్తూ, ప్రజలకు మెరుగైన సేవలు అందించే సామర్థ్యం రెవెన్యూ శాఖకు ఉందన్నారు. కోవిడ్-19 మహమ్మారి సమయంలో వైద్య ఆరోగ్య శాఖతో సమన్వయం చేస్తూ ప్రజల తరలింపు, కాంటాక్ట్ ట్రేసింగ్, కంటైన్‌మెంట్ చర్యలు, అత్యవసర సేవల సమన్వయం వంటి కీలక బాధ్యతలను రెవెన్యూ అధికారులు, సిబ్బంది సమర్థవంతంగా నిర్వహించారని గుర్తుచేశారు. అలాగే వరదలు, కరువు, తుఫానులు వంటి ప్రకృతి విపత్తులు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో డిజాస్టర్ రెస్పాన్స్ బృందాలు, పోలీసు శాఖలతో కలిసి తొలి స్పందన దళంగా పనిచేస్తూ ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. మారుతున్న కాలానుగుణంగా కొత్త సవాళ్లు, సమస్యలు ఉత్పన్నమవుతున్న నేపథ్యంలో వాటిని సమర్థవంతంగా ఎదుర్కొంటూ ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించడం ప్రతి రెవెన్యూ ఉద్యోగి బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. ప్రజల అంచనాలకు అనుగుణంగా సేవల నాణ్యతను మరింత మెరుగుపరచాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధితో రెవెన్యూ శాఖ సేవలు ప్రజలకు మరింత చేరువయ్యాయని జాయింట్ కలెక్టర్ తెలిపారు. గతంలో తహశీల్దార్ కార్యాలయాలకు వెళ్లి పొందాల్సిన భూ రికార్డులు, 1-బి, అడంగల్ వంటి వివరాలు ప్రస్తుతం ఆన్‌లైన్‌లో ఉచితంగా అందుబాటులో ఉన్నాయని, భూ రికార్డుల సవరణ ప్రక్రియ కూడా సులభతరమైందన్నారు. ప్రస్తుతం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) ద్వారా అందుతున్న ఫిర్యాదుల్లో 70 నుంచి 80 శాతం వరకు రెవెన్యూ శాఖకు సంబంధించినవే ఉండటం ప్రజలు శాఖపై ఉంచిన విశ్వాసానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఇటీవల తుగ్గలి మండలంలో నిర్వహించిన కార్యక్రమాల్లో భారీ సంఖ్యలో వినతులు రావడం కూడా ప్రజలకు తమ సమస్యలను పరిష్కరించే శాఖగా రెవెన్యూను భావిస్తున్నారనే విషయాన్ని స్పష్టం చేస్తోందన్నారు. ప్రజల్లో రెవెన్యూ శాఖపై ఏర్పడిన విశ్వాసాన్ని మరింత పెంపొందించడమే కాకుండా, ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ నమ్మకం దెబ్బతినకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి అధికారి, ఉద్యోగిపై ఉందన్నారు. ప్రజలకు సమయానుకూలంగా, పారదర్శకంగా, బాధ్యతాయుతంగా సేవలు అందించడం ద్వారానే శాఖ ప్రతిష్ఠ మరింత పెరుగుతుందని జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ పేర్కొన్నారు.
అంతకముందు కలెక్టరేట్ కార్యాలయంలో రెవెన్యూ డిపార్ట్మెంట్ కి సంబంధించిన స్టాళ్లను పరిశీలించి, అనంతరం రెవెన్యూ దినోత్సవం పురస్కరించుకొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సునీత బాయి, అనురాధ, నాగ ప్రసన్న, కలెక్టరేట్ కార్యాలయపు పరిపాలన అధికారి రవి, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు.

**స్వచ్ఛ ఆంధ్రతో పరిశుభ్రత. యోగాంధ్రతో ఆరోగ్యవంతమైన సమాజం.**

**పరిశుభ్రమైన పరిసరాలు - ఆరోగ్యకర జీవనానికి యోగా అవసరం.**

**జిల్లావ్యాప్తంగా 4,600 కేంద్రాల్లో యోగాంధ్రకు విస్తృత ఏర్పాట్లు.**

**యోగాంధ్ర-2026ను విజయవంతం చేయాలి. నంద్యాల కలెక్టర్ రాజకుమారి గణియా.**






**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్ 20:**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమంలో భాగంగా శనివారం నంద్యాల పట్టణంలోని రైల్వే స్టేషన్ పరిసరాలు, ప్రధాన వీధులు, ప్రజా ప్రదేశాల్లో నిర్వహించిన పారిశుద్ధ్య కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ బైరెడ్డి శబరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు స్వయంగా పరిశుభ్రత కార్యక్రమాల్లో పాల్గొని ప్రజల్లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ గత ఏడాది జనవరిలో ప్రారంభమైన "స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమం జిల్లాలో నిరంతరంగా కొనసాగుతోందని తెలిపారు. పరిశుభ్రమైన పరిసరాల నిర్మాణంలో ప్రతి పౌరుడి భాగస్వామ్యం అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించడం, ప్రజా ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తోడ్పడాలని ప్రజలకు సూచించారు.రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లోని కాలువలు పూడికతో నిండిపోవడం వల్ల పారిశుద్ధ్య సమస్యలు తలెత్తుతున్నాయని గుర్తించి, వాటి పరిష్కారానికి మున్సిపల్ మరియు రైల్వే శాఖల సమన్వయంతో ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కాలువల పూడికతీత పనులు, అవసరమైన చోట్ల స్లాబ్‌ల ఏర్పాటు, అదనపు డస్ట్‌బిన్‌ల ఏర్పాటు ద్వారా పరిశుభ్ర వాతావరణాన్ని కల్పించనున్నట్లు వెల్లడించారు.
నంద్యాల మున్సిపాలిటీలో గత నాలుగు వారాలుగా చేపడుతున్న "ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమం ద్వారా పేరుకుపోయిన పాత చెత్త (లెగసీ వేస్ట్)ను పూర్తిగా తొలగించి, వ్యర్థాలను వర్గీకరించి కంపోస్టింగ్ యూనిట్లు, బయోడైజెస్టర్ ప్లాంట్లకు తరలించి సేంద్రియ ఎరువులుగా మార్చే చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ వివరించారు. ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా నంద్యాలను మరింత పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా, ఆరోగ్యవంతమైన నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిరోధించడంతో పాటు రోడ్లపై చెత్త వేయకుండా పరిశుభ్రతను జీవనశైలిలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. స్వచ్ఛత కార్యక్రమాలు ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాకుండా ప్రతి పౌరుడి సామాజిక బాధ్యతగా భావించి స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని కోరారు.

**యోగాంధ్ర-2026ను విజయవంతం చేయాలి**

అనంతరం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం నిర్వహించనున్న యోగాంధ్ర-2026 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. జిల్లావ్యాప్తంగా సుమారు 4,600 కేంద్రాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. గ్రామాలు, వార్డులు, మండల కేంద్రాలు, జిల్లా కేంద్రాల్లో ఒకేసారి యోగా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.
జిల్లాలో ఇప్పటికే సుమారు నాలుగు లక్షల మంది యోగాంధ్ర కార్యక్రమాల్లో పాల్గొనేందుకు నమోదు చేసుకోవడం విశేషమని పేర్కొన్నారు. యోగా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించే అద్భుత సాధనమని, దీనిని కేవలం ఒక రోజు కార్యక్రమంగా కాకుండా ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు.
భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన యోగా సంప్రదాయం నేడు అంతర్జాతీయ స్థాయిలో విశేష ఆదరణ పొందుతోందని, ఆరోగ్యవంతమైన మరియు ఆనందకరమైన సమాజ నిర్మాణానికి యోగా సమర్థవంతమైన మార్గమని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో నిర్వహించనున్న యోగాంధ్ర-2026 కార్యక్రమంలో ప్రజలందరూ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# నీట్-యూజీ 2026 పునఃపరీక్ష నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు.

**..జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో సీఎస్ సాయి ప్రసాద్ వీడియో సమీక్ష.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్ 20:**
ఈనెల 21న నిర్వహించనున్న నీట్ (యూజీ)-2026 పునఃపరీక్ష ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ శనివారం విజయవాడ సీఎస్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. నంద్యాల జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి కలెక్టర్ ఛాంబర్ నుంచి వీడియో సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 65,790 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారని, వారి కోసం 185 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. ప్రతి జిల్లాలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి పరీక్షల నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రశ్నాపత్రాలు, జవాబు పత్రాల రవాణా మరియు భద్రపరచడంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, సీసీటీవీ నిఘాలో స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరచాలని స్పష్టం చేశారు. ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నందున పరీక్షా కేంద్రాల పరిసరాల్లో నిషేధాజ్ఞలు అమలు చేయడంతో పాటు అవసరమైతే ఇంటర్నెట్ సేవలను నియంత్రించాలని సూచించారు. దివ్యాంగ అభ్యర్థులకు అదనంగా ఒక గంట సమయం కల్పించనున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల సమీపంలోని ఫోటోకాపీ కేంద్రాలు, సైబర్ కేఫ్‌లు, కోచింగ్ సెంటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలని, కేంద్రాల్లో తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ప్రాథమిక వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. సోషల్ మీడియాలో పేపర్ లీకేజీ వంటి తప్పుడు ప్రచారాలు, వదంతులు సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, నకిలీ గుర్తింపు కార్డులు లేదా ఇతర అక్రమ మార్గాల ద్వారా పరీక్ష రాసేందుకు ప్రయత్నించే వారిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టాలని సీఎస్ సాయి ప్రసాద్ స్పష్టం చేశారు.

# అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం సదుపాయాలను ఉపయోగించుకోవాలి.

**..పిల్లల సమగ్ర వికాసానికి అంగన్‌వాడీలు వేదికలు : జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్ 20:**
చిన్నారుల ఆరోగ్యం, పోషణ, విద్యాభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పలు సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. శనివారం నంద్యాల పట్టణం బొగ్గులైన్ ప్రాంతంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించి, ప్రభుత్వం అందించిన సదుపాయాల వినియోగం, చిన్నారులకు అందుతున్న సేవలు, పోషకాహార పంపిణీ విధానాన్ని సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బొగ్గులైన్ అంగన్‌వాడీ కేంద్రంలో పరిశుభ్రత ప్రమాణాలను మరింత మెరుగుపరచాలని సిబ్బందిని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాలు చిన్నారులను పాఠశాల విద్యకు సిద్ధం చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని, పిల్లల ఆరోగ్యం, విద్యాభివృద్ధికి ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను తల్లిదండ్రులు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. చిన్నారులు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యవంతంగా ఎదగాలంటే వారిని క్రమం తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా ఆరు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 1663 అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహించబడుతున్నాయని, ఈ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు నాణ్యమైన సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. చిన్నారులకు పరిశుభ్రమైన వాతావరణంలో పౌష్టికాహారం అందించేందుకు ప్రతి అంగన్‌వాడీ కేంద్రానికి ప్రభుత్వం ప్రత్యేకంగా యుటెన్సిల్స్ కిట్‌తో పాటు ఇండక్షన్ స్టవ్‌లను అందించిందన్నారు. ఇంధన పొదుపు, సురక్షిత వంట విధానాలను ప్రోత్సహించే దిశగా ఇండక్షన్ స్టవ్‌ల వినియోగాన్ని అన్ని కేంద్రాల్లో అమలు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రం ద్వారా చిన్నారులకు పాలు, గుడ్లు, పోషకవిలువలు అధికంగా ఉన్న ఆహారాన్ని క్రమం తప్పకుండా అందిస్తున్నామని సిబ్బంది కలెక్టర్ కు నివేదించారు. అంతేకాకుండా ఆటలు, పాటలు, ప్రాథమిక అభ్యాస కార్యక్రమాల ద్వారా పిల్లల్లో మానసిక, శారీరక వికాసాన్ని పెంపొందిస్తూ, ప్రాథమిక విద్యకు అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేస్తున్నామని కలెక్టర్ కు వివరించారు.

# పోలీస్ స్టేషన్లలో సామాన్యులకు సత్వర న్యాయం అందించాలి.

## - సిపిఐ డిమాండ్



**ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ జూన్ 20:**
నంద్యాల పట్టణ పరిధిలోని పోలీస్ స్టేషన్లలో బాధితులకు సత్వర న్యాయం అందేలా చూడాలనిసిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలో ఇటీవల జరుగుతున్న కొన్ని సంఘటనలపై పోలీస్ వ్యవస్థ స్పందిస్తున్న తీరు పట్ల శనివారం ఒక ఉమ్మడి ప్రకటనలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫకృద్దీన్, పట్టణ కార్యదర్శి ప్రసాద్ లు తమ ఆవేదనను వ్యక్తం చేశారు.పట్టణంలో వివిధ రకాల సంఘటనలు చోటుచేసుకుంటున్నప్పటికీ, పోలీసులు వాటిపై మరింత వేగంగా స్పందించాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. ప్రస్తుతం పట్టణంలో దొంగతనాలు, హత్యలు, అత్యాచారాలు, భూ ఆక్రమణలు వంటివి ఎన్నో జరుగుతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి పరిస్థితుల్లో బాధితులు పోలీస్ స్టేషన్‌కు వచ్చిన తర్వాత తమకు సరైన న్యాయం జరుగుతుందో లేదోననే సందేహంతో, చాలా మంది మధ్యలోనే కేసులు వదిలేసే పరిస్థితి వస్తోందన్నారు. పోలీసులు కేసులను సరిగా పట్టించుకోకపోవడం వల్లే నిందితులకు సరైన శిక్షలు పడడం లేదని, దీనివల్ల బాధితులు మరింత భయపడుతున్నారని వారు పేర్కొన్నారు. సామాన్యునికి ఖచ్చితంగా న్యాయం జరుగుతుందనే గట్టి భరోసాను పోలీసులే స్వయంగా కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.
శాంతిభద్రతల విభాగం త్వరితగతిన స్పందిస్తేనే సామాన్య ప్రజలకు రక్షణపై నమ్మకం కలుగుతుందని, అప్పుడే సామాన్యులు సైతం ఎలాంటి భయం లేకుండా స్టేషన్లకు వచ్చి తమ సమస్యలను చెప్పుకోవడానికి ముందుకు వస్తారన్నారు. లేనిపక్షంలో సాధారణ ప్రజలు న్యాయం కోసం తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్లలో కింది స్థాయి సిబ్బంది వరకు అసలు ఏమి జరుగుతుందనే విషయంపై జిల్లా స్థాయి అధికారులు పూర్తి స్థాయిలో దృష్టి పెట్టాలని వారు డిమాండ్ చేశారు. స్థానిక స్టేషన్ల పనితీరుపై ఉన్నతాధికారులు నిఘా ఉంచితేనే క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న అసలు సమస్యలు బయటకు తెలుస్తాయని వారు అభిప్రాయపడ్డారు. బాధితులతో ఉన్నతాధికారులు స్వయంగా కలిసి మాట్లాడినప్పుడు మాత్రమే వారికి వ్యవస్థపై పూర్తి భరోసా కల్పించినట్లు అవుతుందని నాయకులు స్పష్టం చేశారు. ఇప్పటికైనా జిల్లా స్థాయి ఉన్నతాధికారులు నంద్యాల పట్టణంలో జరుగుతున్న పరిణామాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, పోలీస్ వ్యవస్థను మరింత చురుగ్గా మారుస్తూ సామాన్యులకు సకాలంలో న్యాయం అందేలా తగిన చర్యలు తీసుకోవాలని సిపిఐ నాయకులు ఈ సందర్భంగా కోరారు.

EDITOR.PRINTED,PUBLISHED AND OWENED BY CHINNA MATHANGI SREENIVASULU AND PRINTED AT:JRD PUBLICATIONS, # 11-107, ABBAS NAGAR, DISTRICT- KURNOOL,ANDHRA PRADESH- 518002
AND PUBLUSHED FROM #24-100B, HARIJANAWADA, NANDYAL, ANDHRA PRADESH- 518501 RNI : APTEL/2023/89112, PHONE NO: 81211 33006, EMAIL ID : SREENIVAS.CM77@GMAIL.COM

# బహుళ పంటల సాగును రైతులు ప్రోత్సహించాలి.

## ..రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి. ..జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.

**ఆంధ్ర ప్రగతి కర్నూలు/కల్లూరు జూన్ 20:**
అన్నదాతకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని, రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో అన్నదాత సుఖీభవ-పిఎం కిసాన్ పథకం కింద జిల్లాలో అర్హులైన 2,72,757 రైతులకు రూ.180.15 కోట్లు లబ్ది కలిగిందని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి పేర్కొన్నారు.





శనివారం కల్లూరు మండలం ఉలిందకొండ గ్రామంలో 2026-27 ఆర్థిక సంవత్సరంలో అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ మొదటి విడత నిధుల విడుదల కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న ఖరీఫ్ సీజన్‌లో ఎల్‌నినో ప్రభావం కారణంగా సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు శాస్త్రీయ పద్ధతులను అనుసరించి పంటల సాగు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సూచించారు. వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా సాగు విధానాలు, అనుకూల పంటల ఎంపికపై వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తారని, వారు అందించే సూచనలు, సలహాలను రైతులు తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ కోరారు.. వ్యవసాయ శాఖ నిర్వహిస్తున్న "పొలం పిలుస్తోంది" కార్యక్రమంలో రైతులు చురుకుగా పాల్గొని వ్యవసాయ నిపుణుల సలహాలను పాటించాలని కలెక్టర్ తెలిపారు. రైతులు ఒకే పంటపై ఆధారపడకుండా బహుళ పంటల సాగు (మల్టీ క్రాపింగ్) చేపట్టడం ద్వారా ఆదాయాన్ని పెంచుకోవడంతో పాటు ప్రకృతి వైపరీత్యాల వల్ల కలిగే నష్టాలను తగ్గించుకోవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రస్తుతం వ్యవసాయ రంగంలో అమలవుతున్న "ఏటీఎం మోడల్", "ఏ-గ్రేడ్ మోడల్" వంటి బహుళ పంటల సాగు విధానాలు రైతులకు మంచి ఆదాయాన్ని అందిస్తున్నాయని, వాటిపై అవగాహన పెంపొందించుకోవాలని కలెక్టర్ రైతులకు సూచించారు. అదే విధంగా రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న తోటను, పూర్తిగా రసాయన ఎరువులు ఉపయోగిస్తున్న తోటను పరిశీలించినప్పుడు స్పష్టమైన తేడా కనిపించిందన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండిన పంట వారం రోజుల పాటు నిల్వ ఉంచినా నాణ్యత కోల్పోకపోగా, రసాయన ఆధారిత సాగులో పండిన పంట ఒక రోజులోనే నాణ్యత కోల్పోతున్నట్లు గమనించామని కలెక్టర్ తెలిపారు. మన పిల్లలకు ఆరోగ్యకరమైన భవిష్యత్తు, శుద్ధమైన ఆహారం, స్వచ్ఛమైన నీరు, పరిశుభ్రమైన గాలి, సారవంతమైన నేలను అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఆస్తుల కంటే ఆరోగ్యమే గొప్ప సంపద అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని, రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేయాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

వ్యవసాయ శాఖ ద్వారా సబ్సిడీపై అందిస్తున్న కందులు, వేరుశనగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే భూమి కలిగిన ప్రతి రైతు సాధ్యమైనంత వరకు ఆవులు, బర్రెలు వంటి పశువులను పెంచాలన్నారు. పశువుల ద్వారా రోజువారీ ఆదాయం లభించడంతో పాటు పంటలు దెబ్బతిన్న సందర్భాల్లో కూడా కుటుంబ ఖర్చులను నిర్వహించుకునే అవకాశం ఉంటుందన్నారు. అందువల్ల వ్యవసాయంతో పాటు పశు పోషణను అనుబంధ వృత్తిగా స్వీకరించాలని కలెక్టర్ రైతులను కోరారు..ఈ నేపథ్యంలో జిల్లాలో 10 వేల పశువుల పంపిణీ లక్ష్యాన్ని నిర్దేశించగా, ఇప్పటికే 12 వేల దరఖాస్తులను బ్యాంకులకు పంపించినట్లు కలెక్టర్ తెలిపారు. దరఖాస్తుల ఆమోద ప్రక్రియను వేగవంతం చేసేందుకు బ్యాంకు అధికారులతో నిరంతరం సమీక్షలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ "అన్నదాత సుఖీభవ" పథకం ద్వారా ఏడాదికి 20,000 సాయం అందిస్తోందన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం సందర్భంగా పీఎం కిసాన్ 2,000తో పాటు రాష్ట్ర ప్రభుత్వం 5,000 మొదటి విడత సాయం రైతుల ఖాతాల్లో జమ చేసిందన్నారు. రైతులకు విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పరికరాలపై సబ్సిడీలు అందిస్తూ, డ్రోన్ టెక్నాలజీ వినియోగాన్ని ప్రోత్సహిస్తోందన్నారు. మన ప్రభుత్వం వ్యవసాయ రంగ అభివృద్ధికి మరియు రైతుల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందన్నారు. విత్తనాల కొనుగోలు, ఎరువుల సమీకరణ, కూలీల ఖర్చులు వంటి వ్యవసాయ అవసరాలకు ఈ సాయం ఎంతో దోహదపడుతుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో తీసుకువచ్చిన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ ను, మన ప్రభుత్వం అధికారంలోకి రాగానే రద్దు చేసిందన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో భాగంగా ప్రతి నెల ప్రతి నియోజకవర్గంలో వారానికి ఒక్కసారి ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. పాణ్యం నియోజకవర్గంలోని గోరకల్లు రిజర్వాయర్ కు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మొదట రూ.1 కోటి, అనంతరం రూ.2.60 కోట్లు మంజూరు చేసిందన్నారు. అనంతరం నీటిపారుదల శాఖ మంత్రి స్వయంగా పరిశీలించి, ఆనకట్ట ఒకటి రెండు చోట్ల కాదు, దాదాపు 10 ప్రాంతాల్లో దెబ్బతిన్నట్లు గుర్తించి, ఈ అంశాన్ని మంత్రివర్గం ముందు ఉంచి, మరమ్మతుల కోసం రూ.58 కోట్లు మంజూరు చేయించారన్నారు. ఈ పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయన్నారు. అలాగే అలగనూరు రిజర్వాయర్ పరిస్థితి కూడా ఇదే విధంగా ఉందన్నారు. గతంలో ఆనకట్ట దెబ్బతిన్నప్పుడు తక్కువ వ్యయంతో పూర్తి చేయవచ్చిన పనులు నిర్లక్ష్యం కారణంగా నిలిచిపోయాయన్నారు. ఫలితంగా ప్రస్తుతం నిపుణుల అంచనా ప్రకారం మరమ్మతులకు రూ.36 కోట్లు అవసరమవుతున్నాయని, ఈ నిధులను కూడా కూటమి ప్రభుత్వమే మంజూరు చేసిందన్నారు. ఈ పనులు కూడా త్వరలో ప్రారంభమై పూర్తవనున్నాయన్నారు. ఉల్లిందకొండ చెరువు, తడకనపల్లె చెరువు, చిన్నటేకూరు చెరువులను త్వరితగతిన నింపేందుకు చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ శాఖ మంత్రి ని కోరడం జరిగిందన్నారు. అందుకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని మంత్రి తెలిపారన్నారు.

యూరియా సరఫరా లో ఎటువంటి కొరత లేదని, రైతులు ఎవ్వరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఎక్కువ మందులు వాడకుండా చాలా మంది రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు వెళ్లాల్సిందిగా ఎమ్మెల్యే కోరారు. జిల్లాలో ఉల్లి పంట సాగు చేసి నష్టపోయిన రైతులకు హెక్టారుకు (రెండున్నర ఎకరాలకు) రూ.50,000 ఆర్థిక సహాయం అందించి రైతులకు అండగా నిలిచిన ఘనత కూటమి ప్రభుత్వానిదన్నారు. కందులు, జొన్నలు, మొక్కజొన్న వంటి పంటలను ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేస్తూ రైతులకు భరోసా కల్పిస్తోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇంటి పన్నులు, చెత్త పన్నులు, పెట్రోలుడీజిల్ ధరలు పెరగడంతో పాటు విద్యుత్ ఛార్జీలు దాదాపు తొమ్మిది సార్లు పెరిగాయన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కసారైనా విద్యుత్ ఛార్జీలు పెంచలేదని, ట్రూ-అప్‌ను ట్రూ-డౌన్‌గా మార్చిన ఘనత కూడా ఈ ప్రభుత్వానిదేనన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రహదారులను గుంతల రహితంగా తీర్చిదిద్దే విధంగా చర్యలు తీసుకున్నారన్నారు.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో తన నిబద్ధతను చాటుకుందన్నారు. అందులో భాగంగా తొలి సంతకాన్ని మెగా డీఎస్సీ ఫైల్ పై చేసి, 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టిందన్నారు.. దేశంలోని అనేక రాష్ట్రాల్లో సామాజిక భద్రతా పెన్షన్లు 1,000 నుంచి 2,500 మధ్య మాత్రమే ఉన్నప్పటికీ, ఆంధ్రప్రదేశ్‌లో వృద్ధులు, వికలాంగులు, వితంతువులు మరియు ఇతర అర్హులైన లబ్ధిదారులకు అధిక స్థాయిలో పెన్షన్లు అందిస్తూ ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. పెన్షన్లతో పాటు "అన్నదాత సుఖీభవ", "తల్లికి వందనం" వంటి పథకాల ద్వారా ప్రజలకు నేరుగా ప్రయోజనాలు అందిస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన యూనిఫాంలు, షూస్, బ్యాగులు మరియు ఇతర విద్యా సామగ్రిని అందజేస్తోందన్నారు. గతంలో ప్రాథమిక పాఠశాలల్లో ఐదు తరగతులకు ఒకే ఉపాధ్యాయుడు ఉండే పరిస్థితి కనిపించేదని, ఇప్పుడు ప్రతి తరగతికి ప్రత్యేక ఉపాధ్యాయుడిని నియమిస్తూ విద్యార్థులకు మెరుగైన బోధన అందిస్తోందన్నారు. అలాగే మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యమైన సన్నబియ్యంతో ఆహారం అందిస్తూ పిల్లల ఆరోగ్యం, విద్య రెండింటినీ ప్రభుత్వం సమానంగా కాపాడుతోందన్నారు. విద్యా రంగంలో వస్తున్న మార్పులకు పాణ్యం నియోజకవర్గం ఒక మంచి ఉదాహరణ అని, ఇక్కడ ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే గర్ల్స్ స్కూల్ & హాస్టల్ లో చదువుతున్న విద్యార్థిని సాయిశ్రీ రాష్ట్ర స్థాయిలో అద్భుత ప్రతిభ కనబరిచి, 600 మార్కులకు 596 మార్కులు సాధించి స్టేట్ ర్యాంక్ పొందిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల అవసరాలను గుర్తించి మళ్లీ 204 అన్నా క్యాంటీన్లను ప్రారంభించిందన్నారు. ఈ అన్నా క్యాంటీన్ పేదలు, కార్మికులు, సాధారణ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారిందన్నారు.

అనంతరం అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ 2026-27 మొదటి విడత నిధుల విడుదల కార్యక్రమం కింద పాణ్యం నియోజకవర్గంలోని 32,978 మంది రైతులకు 22.06 కోట్ల రూపాయల చెక్కును కలెక్టర్, పాణ్యం ఎమ్మెల్యే రైతులకు అందజేసారు.

ముందుగా ప్రధాన మంత్రి వర్యులు, ముఖ్యమంత్రి వర్యుల ప్రసంగాన్ని కలెక్టర్, పాణ్యం ఎమ్మెల్యే వర్చువల్ విధానం ద్వారా వీక్షించారు.

కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, ఉద్యాన శాఖ అధికారి రాజాకృష్ణ రెడ్డి, సింగిల్ విండో ప్రెసిడెంట్ రమణ, నీటి సంఘం అధ్యక్షుడు రంగస్వామి, తదితరులు పాల్గొన్నారు.

# నాన్న ఎందుకో వెనకబడ్డాడు..!


## మాటల్లో అమ్మ ప్రేమ... మౌనంలో నాన్న త్యాగం.

## ..నాన్నంటే నమ్మకం... నాన్నంటే భరోసా... నాన్నంటే ధైర్యం... నాన్నంటే బాధ్యత.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా జూన్ 20:**
అమ్మ ప్రేమ గురించి మాట్లాడినంతగా నాన్న ప్రేమ గురించి మాట్లాడం. తల్లి ప్రేమను అందరూ గొప్పగా కొనియాడతారు. కానీ నాన్న ప్రేమను వ్యక్తపరచడానికి, ఆయనతో ఉన్న అనుబంధాన్ని మాటల్లో చెప్పడానికి ఎందుకో మనసు తడబడుతుంది. అది భయమో, గౌరవమో, ప్రేమో. ఏదో చెప్పలేని భావన.

నిజానికి నాన్న ప్రేమ మాటల్లో కాదు. మౌనంలో వ్యక్తమవుతుంది. నవమాసాలు మోసి మనకు జన్మనిచ్చిన తల్లి ఎంత గొప్పదో, జీవితాంతం తన కలలను త్యాగం చేసి మన కలల కోసం పోరాడే నాన్న కూడా అంతే గొప్పవాడు.

అందుకే ప్రతి సంవత్సరం జూన్ మూడవ ఆదివారం ఫాదర్స్ డేను జరుపుకుంటాం. అది కేవలం ఒక రోజును గుర్తు చేసుకోవడం కాదు. మన జీవితానికి దారి చూపిన వ్యక్తిని స్మరించుకోవడం.



### అమ్మ పరిచయం చేస్తుంది... నాన్న దారి చూపిస్తాడు

అమ్మ మనల్ని ఈ ప్రపంచానికి పరిచయం చేస్తుంది. నాన్న ఈ ప్రపంచంలో ఎలా నిలబడాలో నేర్పిస్తాడు. తల్లి ప్రేమను కళ్లతో చూస్తాం. నాన్న ప్రేమను జీవితాంతం అనుభవిస్తాం.

ఆయన కోపంలో చులకన ఉండదు. బాధ్యత ఉంటుంది. ఆయన మౌనంలో నిర్లక్ష్యం ఉండదు. అపారమైన ప్రేమ దాగి ఉంటుంది.

### తన కలల కంటే మన కలలే ముఖ్యం

తన కలలను పక్కనపెట్టి, పిల్లల కలలను నిజం చేయడానికి శ్రమించేవాడు నాన్న. అనారోగ్యంతో ఉన్నా పని ఆపడు. బాధలో ఉన్నా బాధ్యతను మరవడు. కుటుంబం సంతోషంగా ఉండాలనే ఒక్క ఆలోచనతో నిరంతరం కష్టపడుతూనే ఉంటాడు. పిల్లల ఎదుగుదలే ఆయన గమ్యం. వారే ఆయన ఆశలు. వారే ఆయన ఆయుష్షు. తన విజయాల కంటే పిల్లల విజయాలకే ఎక్కువగా ఆనందపడే వ్యక్తి నాన్న.

### కనిపించని బలం

వేర్లు కనిపించవు. కానీ చెట్టు నిలబడటానికి అవే ఆధారం. అలాగే కుటుంబానికి కనిపించని బలంగా నిలిచేవాడు నాన్న. పురస్కారాలు రాకపోయినా, గుర్తింపు లేకపోయినా కుటుంబం కోసం అహర్నిశలు శ్రమిస్తూనే ఉంటాడు.

మన విజయాల వెనుక నిలిచే నిశ్శబ్ద శక్తి ఆయనే. నాన్న ఉన్నప్పుడు ఆయన విలువ పూర్తిగా అర్థం కాదు. కానీ ఆయన లేకపోవడాన్ని మాత్రం జీవితం మొత్తం మర్చిపోలేం.



### .నాన్న వెనకబడలేదు... మనమే ఆయనను వెనకబెట్టాం

తల్లి ప్రేమను తరచూ గుర్తు చేసుకుంటాం. నాన్న ప్రేమను మాత్రం చాలా సందర్భాల్లో సహజంగా తీసుకుంటాం. ఆయన తన త్యాగాల గురించి చెప్పుకోడు. తన కష్టాలను బయటపెట్టుకోడు. కానీ ప్రతిరోజూ తన కుటుంబం కోసం, పిల్లల భవిష్యత్తు కోసం నిశ్శబ్దంగా పోరాడుతూనే ఉంటాడు.

అందుకే నాన్న వెనకబడలేదు. మనమే ఆయనను వెనకబెట్టాం. వాట్సాప్ స్టేటస్‌ల్లో అమ్మ ఫోటోలు పెడతాం. నాన్నతో ఫోటో ఎప్పుడు పెట్టాం?

### తల్లిదండ్రులే నిజమైన దేవుళ్లు

తల్లిదండ్రులు తమ కోసం కాదు. పిల్లల కోసం జీవిస్తారు. వారి ఆనందంలోనే తమ ఆనందాన్ని వెతుక్కుంటారు. అలాంటి తల్లిదండ్రులకు ప్రేమ, గౌరవం, ఆదరణ ఇవ్వడం బాధ్యత మాత్రమే కాదు. మన కర్తవ్యం కూడా.

వారిని నిర్లక్ష్యం చేయడం కేవలం ఒక తప్పు కాదు. మనిషితనానికే మాయని మచ్చ. ఫాదర్స్ డే రోజున మాత్రమే కాదు. ప్రతి రోజూ నాన్న ప్రేమను గుర్తుచేసుకుందాం. ఆయన త్యాగాలను గౌరవిద్దాం. ఎందుకంటే మన జీవితంలో కనిపించని హీరో మన నాన్న. ఆయన లేకపోతే మనం లేము. ఆయన లేకపోతే ఈ జీవితం లేదు.

# బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం నిషేధం..!

## -అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తులపై కేసులు నమోదు.

## -నంద్యాల జిల్లాలో ఎక్సైజ్ అధికారుల ఆకస్మిక తనిఖీలు.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 20:**
నంద్యాల జిల్లా ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ అధికారి శ్రీ ఎస్.రవి కుమార్ ఆదేశాల మేరకు, గత మూడు రోజులుగా (17.06.2026 నుండి 20.06.2026 వరకు) ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ శాఖ అధికారులు జిల్లా వ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో మొత్తం 30 బెల్ట్ కేసులు మరియు 18 ఓపెన్ కన్సంప్షన్ కేసులు నమోదు చేశారు. నందికొట్కూరు స్టేషన్ పరిధిలో 3 బెల్ట్ కేసులు మరియు 2 ఓపెన్ కన్సంప్షన్ కేసులు నమోదు చేసి మొత్తం 22 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.నంద్యాల స్టేషన్ పరిధిలో 3 బెల్ట్ కేసులు మరియు 6 ఓపెన్ కన్సంప్షన్ కేసులు నమోదు చేసి మొత్తం 20 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.ఆళ్లగడ్డ స్టేషన్ పరిధిలో 5 బెల్ట్ కేసులు నమోదు చేసి మొత్తం 38 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.బనగానపల్లె స్టేషన్ పరిధిలో 4 బెల్ట్ కేసులు మరియు 1 ఓపెన్ కన్సంప్షన్ కేసులు నమోదు చేసి మొత్తం 25 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.డోన్ స్టేషన్ పరిధిలో 4 బెల్ట్ కేసులు మరియు 3 ఓపెన్ కన్సంప్షన్ కేసులు నమోదు చేసి మొత్తం 31 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.కోయిలకుంట్ల స్టేషన్ పరిధిలో 5 బెల్ట్ కేసులు మరియు 5 ఓపెన్ కన్సంప్షన్ కేసులు నమోదు చేసి మొత్తం 40 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.ఆత్మకూరు స్టేషన్ పరిధిలో 6 బెల్ట్ కేసులు మరియు 1 ఓపెన్ కన్సంప్షన్ కేసులు నమోదు చేసి మొత్తం 54 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ఈ తనిఖీలలో మొత్తం 30 బెల్ట్ కేసులు, 18 ఓపెన్ కన్సంప్షన్ కేసులు నమోదు కాగా, మొత్తం 230 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ అధికారి శ్రీ ఎస్. రవి కుమార్ మాట్లాడుతూ, బహిరంగ ప్రదేశాలు, ఖాళీ స్థలాలు, రహదారులపై మద్యం సేవించడం మరియు ప్రభుత్వ అనుమతులు లేకుండా మద్యం నిల్వ ఉంచి విక్రయించడం ఎక్సైజ్ చట్టం ప్రకారం నేరమని తెలిపారు. ఎవరైనా నిబంధనలను ఉల్లంఘించినట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు.?

# డాక్టర్ కే రామలింగారెడ్డి మృతి.

## డాక్టర్ రామలింగారెడ్డి భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ.

**ఆంధ్ర ప్రగతి ఆళ్లగడ్డ ప్రతినిధి జూన్ 20:**
ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు, మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ రామలింగారెడ్డి (87) శనివారం కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, శనివారం పరిస్థితి విషమించడంతో తుదిశ్వాస విడిచారు. ఆళ్లగడ్డ పట్టణంలో సుదీర్ఘకాలంగా వైద్యుడిగా సేవలందిస్తూ, ప్రజాప్రతినిధిగా పట్టణాభివృద్ధికి ఆయన చేసిన కృషి ఎనలేనిది.డాక్టర్ కె. రామలింగారెడ్డి మృతి చెందిన విషయం తెలియగానే స్థానిక ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ వెంటనే స్పందించారు. పట్టణంలోని నెహ్రూ వీధిలో ఉన్న ఆయన నివాసానికి చేరుకుని, రామలింగారెడ్డి భౌతికకాయానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా తీవ్ర దుఃఖంలో ఉన్న కుటుంబ సభ్యులను ఆమె ఓదార్చారు. వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ధైర్యంగా ఉండాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే అఖిలప్రియ మాట్లాడుతూ. ఆళ్లగడ్డ పట్టణాభివృద్ధికి, ప్రజలకు వైద్య, విద్య సేవలందించడంలో రామలింగారెడ్డి చేసిన సేవలు ఎప్పటికీ మరవలేనివని కొనియాడారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.రామలింగారెడ్డి మరణవార్త తెలియడంతో ఆళ్లగడ్డ పట్టణంలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఆయన మృతి పట్ల పట్టణంలోని పలువురు ప్రముఖులు, వివిధ పార్టీల నాయకులు, వైద్య బృందం మరియు పట్టణ ప్రజలు తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు.



ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# అంగన్వాడీ టీచర్ గా మారిన ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.

**వంట వండి, వడ్డించి అంగన్వాడీ పిల్లలతో కలిసి సహా బంతి భోజనం చేసిన ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.**

**పిల్లల సమగ్ర వికాసానికి అంగన్‌వాడీ కేంద్రాలు వేదికలు.**

**నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల రూరల్ జూన్ 20:**
అంగన్వాడీ టీచర్ గా మారి, చిన్నారుకు ఆట, పాట, చేతి వ్రాత, బొమ్మల గుర్తింపు తదితర వాటిని చేయించి పిల్లలను ఉత్సాహపరిచి వారితో నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, టీడీపీ లోక్ సభ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి ఆనందంగా గడిపారు.

శనివారం నంద్యాల మండలం కొత్తపల్లి గ్రామంలోని రెండు అంగన్వాడీ కేంద్రాలను నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి రెండు అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించి, ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రం ద్వారా ప్రసూతి, గర్భిణీ మహిళలకు, చిన్నారులకు అందించిన సదుపాయాల వినియోగం, అందుతున్న సేవలు, పోషకాహార పంపిణీ విధానాన్ని పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలో పరిశుభ్రత మెరుగుపరచాలని, అంగన్‌వాడీ కేంద్రాలు చిన్నారులను పాఠశాల విద్యకు సిద్ధం చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని, పిల్లల ఆరోగ్యం, విద్యాభివృద్ధికి ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను తల్లిదండ్రులు వినియోగించుకోవాలని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కోరారు. చిన్నారులు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యవంతంగా ఎదగాలంటే వారిని క్రమం తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.

అంగన్‌వాడీ కేంద్రం ద్వారా చిన్నారులకు పాలు, గుడ్లు, పోషకవిలువలు అధికంగా ఉన్న ఆహారాన్ని క్రమం తప్పకుండా ప్రభుత్వం అందిస్తుందని, ఆటలు, పాటలు, ప్రాథమిక అభ్యాస కార్యక్రమాల ద్వారా పిల్లల్లో మానసిక, శారీరక వికాసాన్ని పెంపొందిస్తూ, ప్రాథమిక విద్యకు అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి పాటుపడుదాం అన్నారు. ఈ కార్యక్రమంలో మార్క్ ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ తాతిరెడ్డి తులసి రెడ్డి, సెంట్రల్ ఫుడ్ కార్పొరేషన్ డైరెక్టర్ నరహరి. విశ్వనాథ్ రెడ్డి, డిఇఓ జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల పిల్లలకు పాఠశాలల్లో 50% ఫీజు రాయితీ కోరుతూ జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం.

**..మీడియా కుటుంబాలకు విద్యా భరోసా కల్పించి,జర్నలిస్టుల పిల్లల ఫీజు భారం తగ్గించాలని జిల్లా కలెక్టర్‌ను కోరిన ఐఆర్ఏ నాయకులు.**

**..సానుకూలంగా స్పందించిన జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా..జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీపై ఆశలు.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా జూన్ 20**
నంద్యాల జిల్లాలో అక్రిడేషన్ కలిగిన జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్,కార్పొరేట్ పాఠశాలల్లో 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని ఇండియన్ రిపోర్టర్ అసోసియేషన్ నాయకులు జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియాకు వినతిపత్రం అందజేశారు. శనివారం కలెక్టరేట్‌లో ఇండియన్ రిపోర్టర్స్ అసోసియేషన్ జాతీయ కార్యదర్శి జాషువా బాబు,రాష్ట్ర అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శరత్ బాబు,రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయ్ బాబు,నంద్యాల జిల్లా అధ్యక్షుడు లెజెండ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ..జర్నలిస్టులు ప్రజాస్వామ్య వ్యవస్థలో నాలుగో స్తంభంగా పనిచేస్తూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడం,ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడం, సమాజంలో జరిగే అనేక అంశాలను నిష్పాక్షికంగా ప్రజలకు తెలియజేస్తున్నారని పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం చాలా మంది జర్నలిస్టులు తక్కువ వేతనాలతోనే కుటుంబాలను పోషించుకుంటూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తమ పిల్లలకు నాణ్యమైన విద్య అందించాలనే ఉద్దేశంతో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో చదివిస్తున్నప్పటికీ అధిక ఫీజులు భారంగా మారుతున్నాయని కలెక్టర్ కు వివరించారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో జర్నలిస్టుల పిల్లలకు ప్రత్యేక రాయితీలు కల్పించిన విషయాన్ని ప్రస్తావిస్తూ,నంద్యాల జిల్లాలో కూడా ఇదే విధానాన్ని అమలు చేయాలని కోరారు.

వినతిపై జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా సానుకూలంగా స్పందించినట్లు ఇండియన్ రిపోర్టర్స్ అసోసియేషన్ నాయకులు తెలిపారు. జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలతో చర్చించి, జిల్లాలో అక్రిడేషన్ కలిగిన జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ కల్పించేలా చర్యలు తీసుకుంటామని,సోమవారం దీనిపై నిర్ణయం ప్రకటించే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా అసోసియేషన్ నాయకులకు హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం జిల్లా యంత్రాంగం తీసుకోబోయే ఈ నిర్ణయం వృత్తిలో ఉన్న కుటుంబాలకు ఎంతో ఉపశమనం కలిగిస్తుందని నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని పలువురు జర్నలిస్టులు, ఇండియన్ రిపోర్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# స్వర్గధామం వైకుంఠ రథం కోసం పదిలక్షలు సహాయం చేసిన గోళ్ళ రాజేష్.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 20:**
నంద్యాలలో భీమవరం రాస్తాలో మరియు బస్టాండ్ దగ్గర నంద్యాల నవనిర్మాణ సమితి నిర్వహిస్తున్న రెండు హిందూ స్మశాన వాటికలను స్వర్గధామం" అన్న పేరుతో పది సంవత్సరాల నుంచి జీర్ణోద్ధరరణ చేసి నిర్వహణ చేస్తున్న విషయం మీకు అందరికీ తెలుసు. అందులో మానవతా సంస్థ వాళ్ళు ఇచ్చిన వైకుంఠ రథం ఒకటే ఉన్నది. నంద్యాల చుట్టుపక్కన 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న పల్లెటూర్లకు కూడా ఫ్రీజర్ బాక్స్, వైకుంఠ రథం సేవలను పెంపొందించుటకు మేము అడగగానే స్పందించి మృతి చెందిన ప్రతి హిందువు యొక్క ఆత్మను భగవంతునిలో పంచభూతాలలోఐక్యమయ్యేటువంటి స్వర్గధామానికి రెండవ వైకుంఠ రథం ఇవ్వడానికి ముందుకు వచ్చి వెంటనే స్పందించి పది లక్షల రూపాయల చెక్కును మధుమణి నర్సింగ్ హోమ్ నందు స్వర్గధామం సభ్యులకు అందచేయడం జరిగింది. గోళ్ళ రాజేష్ విశాల హృదయానికి, సమాజ సేవకు, నిష్కలంకమైన హృదయానికి నిదర్శనం. గోళ్ళ రాజేష్ చేస్తున్నటువంటి ఈ సేవా కార్యక్రమానికి నంద్యాల నవనిర్మాణ సమితి సభ్యులు అందరం కూడా కృతజ్ఞతాపూర్వక ధన్యవాదాలు చెబుతున్నారు. ఈ సమావేశంలో స్వర్గధామం అధ్యక్షులు డాక్టర్ మధుసూదనరావు,ఉపాధ్యక్షులు రాజశేఖర్ , ఉపాధ్యక్షులు శేషుబాబు, కార్యదర్శి గెలివి రామకృష్ణ , ట్రెజరర్ కశెట్టి కృష్ణమూర్తి, ద్వారకా వసంతు, షణ్ముఖ శ్రీనివాస్ ఇంకా స్వర్గధామం సేవకులు కూడా పాల్గొనడం జరిగింది.

# కూటమి ప్రభుత్వంలో పోలీసులు రాజకీయ తొత్తులుగా మారారు. -.వైసీపీ లీగల్ సెల్



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 20:**
రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం లో పోలీసులు రాజకీయ తొత్తులుగా మారారని నంద్యాల లీగల్ సెల్ నాయకులు సంచలన వ్యాక్యలు చేశారు. శనివారం నంద్యాలలోని స్థానిక వైసీపీ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ లీగల్ సెల్ ప్రతినిధుల సమావేశం నిర్వహించడం జరిగింది. సమావేశంలో నంద్యాల జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు రామసుబ్బయ్య, నంద్యాల అధ్యక్షుడు ప్రతాప్రెడ్డి, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ శ్రీనివాసులు స్టేట్ అఫీషియల్ స్పోక్స్ పర్సన్ తిమ్మారెడ్డి, ఆర్టీఏ నంద్యాల అసెంబ్లీ వింగ్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, గ్రీవెన్స్ సెల్ అసెంబ్లీ అధ్యక్షుడు వివేకానందరెడ్డి, జిల్లా జనరల్ సెక్రటరీ జగన్ మోహన్ రెడ్డి, సాయిరాం రెడ్డి, మదాని, సోహేల్ రాణా, ద్వారకానాథ్, శరత్, రామాంజనే యులు, వసంత్ రెడ్డి, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నంద్యాల వైసీపీ లీగల్ సెల్ నాయకులు మాట్లాడుతూ...రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో అరాచకాలు, దౌర్జన్యాలు, సోషల్ మీడియా ఆక్టివిస్టపై వైసీపీ నాయకులు, కార్యకర్తలపై అనవరస కేసులు నమోదు చేస్తు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. సమాజంలో పోలీసుల పాత్ర అత్యంత ప్రధానమైనదని, అయితే నేడు కూటమి ప్రభుత్వంలో వారు రాజకీయతొత్తులుగా మారారని సంచల వ్యాక్యలు చేశారు. ఇటీవల కృష్ణలంక పోలీస్ స్టేషన్ లో కృష్ణవంశీ అనే యువకున్ని లాకప్ డెత్ జరిగిన ఘటన రాష్ట్రంలో సంచలనంగా మారింది. పోలీసుల చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వెళ్లి మృతుని కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి కృష్ణ వంశీ లాకప్ డెత్ గురించి తెలుసుకోవడం జరిగిందని అంతవరకు కనీసం స్పందించని పోలీసులు నేడు కృష్ణలంక సీఐపై కేసు నమోదు చేశారన్నారు. పోలీసు వ్యవస్థ రాష్ట్రంలో నిర్వీర్య అయ్యిందని విమర్శించారు. రాష్ట్రంలో మంత్రులు ఉన్నా అందరిని కేవలం మంత్రి లోకేష్ నియంత్రించడం జరుగుతుందని వారు పేరుకు మాత్రమే మంత్రులన్నారు. జూనియర్ న్యాయవాధుల విషయంలో నాడు వైసీపీ ప్రభుత్వం 5వేల రూపాయలను ఇవ్వడం జరిగిందని, అయితే ఎన్నికల సందర్భంగా జూనియర్ న్యాయవాధులకు నెలకు 10వేల రూపాయలు ఇస్తానని నమ్మించి నేటికి ఇవ్వలేదని మోసం చేశారని విమర్శించారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన వాగ్ధానాలను హామీలను నెరవేర్చలేదని పేర్కొన్నారు. డీఎస్సీ నియామకాల్లో మోసాలు, రైతులకు అన్యాయం చేశారని పేర్కొన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం లేదని కేవలం వైసీపీ నాయకులను, కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేయడమే పనిగా పెట్టుకున్నారని ఎద్దేవాచేశారు. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తున్నదని విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని వారు డిమాండ్ చేశారు.

# నూనెపల్లిలో అంగన్వాడీ కేంద్రాలు,పాఠశాలల తనిఖీ.

**..విద్యార్థుల భోజన నాణ్యతపై నంద్యాల మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మనందరెడ్డి ఆరా**

**..గర్భిణీలకు అందుతున్న పోషకాలపై మాజీ ఎమ్మెల్యే భూమా పరిశీలన.**

**..అంగన్వాడీ సేవలు మెరుగుపర్చాలని సూచన.**

**..చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి అవసరం.. మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మనందరెడ్డి.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 20:**
నంద్యాల పట్టణం నూనెపల్లి ప్రాంతంలో ఉన్న పలు అంగన్వాడీ కేంద్రాలు, ఠాగూర్ ప్రాథమిక పాఠశాలను మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, ఆహార నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలపై సంబంధిత సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మమేకమైన ఆయన, వారికి అందుతున్న విద్యా సదుపాయాలు, పాఠశాలలో ఉన్న మౌలిక వసతుల గురించి ఆరా తీశారు. చిన్నారులకు అందించే ఆహారం పోషక విలువలతో కూడి ఉండాలని, విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులు, సిబ్బందికి సూచించారు.

అనంతరం పలు అంగన్వాడీ కేంద్రాలను సందర్శించిన భూమా బ్రహ్మానందరెడ్డి అక్కడ గర్భిణీ స్త్రీలు, బాలింతలకు అందిస్తున్న పోషకాహార సరఫరా,ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై వివరాలు తెలుసుకున్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహారం నాణ్యతగా ఉండేలా చూడాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ప్రయోజనాలు చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం మహిళలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, అంగన్వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. పిల్లల విద్యాభివృద్ధి, మహిళల ఆరోగ్య సంరక్షణలో అంగన్వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు.



ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అంగన్వాడీ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయానికి కేంద్రం పెద్దపీట..!

**-రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం.! -నంద్యాల జిల్లా బిజెపి అధ్యక్షులు అభిరుచి మధు.**






**ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 20:**
కేంద్ర ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ రైతులకు, నేలకు, ప్రజలకు మేలు చేసే నాణ్యమైన పంటల ఉత్పత్తికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు తెలిపారు.

బనగానపల్లెలో నిర్వహించిన కేంద్రీయ వ్యవసాయ దారుల సమావేశం, "ఖేతీ బచావో" అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, రసాయనాల వినియోగాన్ని తగ్గించి ప్రకృతి వ్యవసాయ విధానాలను అనుసరించడం ద్వారా భూమి సారాన్ని కాపాడుకోవడంతో పాటు రైతుల ఆదాయాన్ని కూడా పెంచుకోవచ్చన్నారు.

రైతులు ఆధునిక వ్యవసాయ సాంకేతికతతో పాటు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవలంబించి ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రైతుల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ, ప్రోత్సాహక పథకాలను అమలు చేస్తోందని తెలిపారు.



సమావేశంలో కృషి విజ్ఞాన్ కేంద్రం ప్రిన్సిపాల్ ధనలక్ష్మి, వ్యవసాయ శాస్త్రవేత్త బాలరాజు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివకృష్ణ, జిల్లా కార్యదర్శి శరత్ కుమార్, కిసాన్ మోర్చా జిల్లా నాయకులు శివరామిరెడ్డి, కేసీ మద్దిలేటి, బాలరాజు, బనగానపల్లె రూరల్ మండల అధ్యక్షుడు హరికృష్ణ, అర్బన్ అధ్యక్షుడు యాదగిరి తదితరులు పాల్గొన్నారు. అధిక సంఖ్యలో రైతులు హాజరై ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పొందారు.